ANN తెలుగు

Follow: @ANNTELUGU

21-08-2025

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 258 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## 21 ఏళ్లకే ఎమ్మెల్యే..

### తెలంగాణ శాసన సభల్లో చట్ట సవరణ చేస్తాం

రాహుల్ గాంధీ ప్రధాని అవ్వగానే బిల్లు తెస్తాం

రాజీవ్ గాంధీ స్ఫూర్తితో స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లు

ఆయన తీసుకొచ్చిన సంస్కరణల వల్లే రాష్ట్రం ప్రపంచంతో పోటీ

రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

వివరాలు 2లో

**టాప్ న్యూస్**

## యూరియా ఇస్తేనే.. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు

- ఢిల్లీలో బాస్‌లు ఎవరూ లేరు.. తెలంగాణ ప్రజలే మా బాసులు
- ఎరువుల కొరతపై రేవంత్ రెడ్డి శ్వేతపత్రం విడుదల చేయాలి
- లేకుంటే రాష్ట్రస్థాయి పోరాట కార్యాచరణ ప్రకటిస్తాం
- బీఆర్ఎస్ నేత కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు



02

## ముస్లింలు బతకొద్దా?

- దమ్ముంటే బీజేపీ రాష్ట్రాల్లో ముస్లిం రిజర్వేషన్ తీసివేయాలి
- స్వాతంత్రం రాకముందు నుంచే ముస్లింలకు రిజర్వేషన్ ఉంది
- బీజేపీపై ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఫైర్
- కాళేశ్వరం రిపోర్ట్ అసెంబ్లీలో పెడుతాం.. ఆ తర్వాతే కేసీఆర్ కోర్టుకెళ్లాలి



02

## ఢిల్లీ సీఎం రేఖా గుప్తాపై దాడి

- ఫిర్యాదుదారుడిగా వచ్చి చెంపదెబ్బ
- తీవ్రంగా ఖండించిన అధికార, ప్రతిపక్ష నేతలు



03




**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,00,150 |
| 22 క్యారెట్ | 91,800 |
| సిల్వర్ (కేజీ) | 1,15,000 |

### పీఎం, సీఎం ఎవరైనా సరే..

# 30 రోజులు జైల్లో ఉంటే పదవి ఊడినట్లే..

### లోక్ సభలో కీలక బిల్లు పెట్టిన కేంద్రమంత్రి అమిత్ షా

కాపీలను చింపి అమిత్ షా పైకి విసిరిన విపక్షాలు

రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చేందుకేనని ధ్వజం

లోక్ సభ ముందుకు మూడు కీలకబిల్లులు



తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధాని, ముఖ్యమంత్రులు, మంత్రులను పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లుతో సహా మూడు బిల్లులను కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా ప్రతిపక్షాల నుంచి పెద్దఎత్తున నిరసన వ్యక్తమైంది. బిల్లుల కాపీలను చింపి అమిత్ షాపైకి విసిరారు. ప్రతిపాదిత బిల్లులు రాజ్యాంగం, సమాఖ్యవాదానికి వ్యతిరేకంగా ఉన్నట్లు విపక్షాలు ఆరోపించాయి. అయితే ఈ బిల్లులను హడావుడిగా తీసుకొచ్చారనే విమర్శలను కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తోసిపుచ్చారు. వాటిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపనున్నట్లు ప్రకటించారు.

- మహా, ఢిల్లీ

02



## మంత్రి పొంగులేటిపై సీఎం ప్రశంసలు

### అద్భుతంగా ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

జూన్ నాటికి 11 కార్యాలయాల బాధ్యత మంత్రిదే..

రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా రూ.15వేల కోట్ల ఆదాయం

గచ్చిబౌలి రిజిస్ట్రార్ ఆఫీసులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన

రూ.30కోట్లతో నిర్మిస్తున్న అపర్ణ కన్ స్ట్రక్షన్స్..

ఎండీ ఉదయ్ ను అభినందించిన సీఎం

రాజీవ్ గాంధీ వల్లే దేశంలో ఐటీ వెలుగులు

03



హనీఫ్ కు తెలుగువర్శిటీ

## కీర్తి పురస్కారం

### వచన కవితా విభాగంలో ఎంపిక

వివిధ రంగాల్లోని 48మందికి పురస్కారాల ప్రకటన

మహాపత్రిక సాహిత్య పేజీ నిర్వహిస్తున్న హనీఫ్

**హైదరాబాద్, మహా:** తెలుగు సాహిత్యరంగంలో తనదైన ప్రత్యేక రచనాశైలితో ప్రశంసలందుకున్న సయ్యద్ హనీఫ్ కు వచన కవితా విభాగంలో తెలుగు యూనివర్శిటీ కీర్తి పురస్కారం దక్కింది.

మిగతా 2లో

**స్టాక్ మార్కెట్**

| | |
|---|---|
| సెన్సెక్స్ | 81,857.84 |
| నిఫ్టీ | 25,050.55 |

**ఈరోజు చికెన్ ధరలు**

1 కేజీ లైవ్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 180 | 220 | 230 |

హోల్ సేల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 160 | 200 | 210 |

**ఈరోజు గుడ్డు ధరలు**

ఎన్ఈసీసీ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 4.95 | 148.5 |

హోల్ సేల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 4.95 | 148.5 |

రిటైల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 5.14 | 157.41 |

## పల్లాకు బ్రహ్మరథం

### చేర్యాలలో ఘనస్వాగతం

ప్రమాదం తర్వాత తొలిసారి జనగామ నియోజకవర్గంలో పర్యటన

ప్రజా సమస్యలను ఎత్తిచూపుతాం

**జనగామ, మహా:** జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి రెండున్నర మాసాల తర్వాత ప్రమాదం నుండి కోలుకుని నియోజకవర్గంలో అడుగుపెట్టారు. కొమురవెల్లి దేవస్థానంలో పర్యటించిన శ్రీ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి,మొక్కులు బడులు చెల్లించుకున్నడా, పల్లా రాజేశ్వర్ రెడ్డికి వేద మంత్రాలతో ఆలయ అర్చకులు అధికారులు ఘనస్వాగతం పలికారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు ఘనంగా స్వాగతించారు. అక్కడి నుండి చేర్యాలలో చేర్యాల పట్టణం, చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు,

మిగతా 2లో



## గోదావరీ

### భద్రాద్రి వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసిన అధికారులు

### పరిస్థితిపై మంత్రి పొంగులేటి ఆరా

**భద్రాచలం, మహా :** రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరడంతో భద్రాచలం వద్ద గోదావరి రెండవ ప్రమాద హెచ్చరిక స్థాయి 48 అడుగులు దాటి ప్రవహిస్తుంది.

మిగతా 2లో



## కేపీహెచ్‌బీలో దారుణం..

వేశ్యకు, విటుడికి గొడవ.. కత్తులతో దాడులు

02

## ప్రభుత్వాలను కూల్చేందుకే కొత్త బిల్లు

- ప్రజాస్వామ్య సూత్రాలను దెబ్బతీసే విధంగా ఉంది
- 130వ రాజ్యాంగ సవరణ బిల్లు రాజ్యాంగబద్ధమైనది కాదు
- ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కీలక వ్యాఖ్యలు

**ఢిల్లీ, మహా:** ముఖ్యమంత్రులు, మంత్రులు, చివరికి ప్రధానమంత్రిని కూడా కేవలం ఆరోపణల ఆధారంగా, కోర్టులో దోషిగా నిరూపణ కాకముందే పదవి నుంచి తొలగించేందుకు కొత్త చట్టాలను తీసుకురావాలని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఈ కొత్త బిల్లులు 'పూర్తిగా విధ్వంసకరమైనవి' అంటూ విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

మిగతా 2లో





## కేపీహెచ్‌బీలో ఎకరం రూ.70 కోట్లు

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ నగరంలోని కేపీహెచ్‌బీలో ఎకరం భూమి రికార్డు స్థాయి ధర పలికింది. హౌసింగ్ బోర్డు అధికారులు మొత్తం 7.80 ఎకరాలను బుధవారం వేలం వేయగా.. అందులో ఎకరం రూ.70 కోట్లకు గోద్రెజ్ ప్రాపర్టీస్ సంస్థ ఈవేలం ద్వారా దక్కించుకుంది. 7.80 ఎకరాల వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.547 కోట్ల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.



# పల్లాకు బ్రహ్మరథం

## చేర్యాలలో ఘనస్వాగతం

ప్రమాదం తర్వాత తొలిసారి జనగామ నియోజకవర్గంలో పర్యటన

ప్రజా సమస్యలను ఎత్తిచూపుతాం



(మొదటిపేజీ తరువాయి)

దుల్మిట్ట మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించగా, చేర్యాలలో గులాబీనేతలు బ్రహ్మరథం పట్టారు. ప్రమాదం నుండి కోలుకుని తమకోసం వస్తున్న నాయకుడిని ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో తాను త్వరగా కోలుకుని మళ్ళీ మీ ముందుకు వచ్చానన్నారు. ప్రజాప్రతినిధిగా, మీ నాయకుడిగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పని చేస్తూనే ఉంటానన్నారు. ప్రజల సమస్యలు ఎత్తిచూపడం, పరిష్కారాల కోసం ప్రయత్నించడం తమ బాధ్యత అన్నారు. దేవాదుల సామర్థ్యాన్ని 50 వేల ఎకరాల నుండి ఐదున్నర లక్షల ఎకరాలకు పెంచిన ఘనత కేసీఆర్ దేనన్నారు. ఒక్క జనగామ నియోజకవర్గంలోనే రెండున్నర లక్షల ఎకరాలు ఆయకట్టుకు నీరు వచ్చిందన్నారు. తాను కదలలేని స్థితిలో ఉన్నా.. సాగునీటి సమస్యపై నిరంతరం అధికారులతో మాట్లాడుతూనే ఉన్నానన్నారు. జూన్ 1న మొదలుకావాల్సిన పంపులు నిర్వహణ లోపాలతో 45రోజులు ఆలస్యంగా ఇచ్చారన్నారు. గత ప్రభుత్వంలో నాలుగు మోటార్లు ఆన్ చేసి బ్రహ్మాండంగా నీరందించగా, ఈ ప్రభుత్వం వచ్చాక 20మాసాల్లో ఒక్క రోజు కూడా ఆ పనిచేయలేదన్నారు.

# యూరియా ఇస్తేనే..
# ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు

- ఢిల్లీలో బాస్‌లు ఎవరూ లేరు.. తెలంగాణ ప్రజలే మా బాసులు
- ఎరువుల కొరతపై రేవంత్ రెడ్డి శ్వేతపత్రం విడుదల చేయాలి
- లేకుంటే రాష్ట్రస్థాయి పోరాట కార్యాచరణ ప్రకటిస్తాం
- బీఆర్ఎస్ నేత కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రైతులకు కావాల్సిన యూరియాను ఇచ్చిన పార్టీకే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇస్తామని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో రాని ఎరువుల కొరత, రేవంత్ అసమర్థతోనే ఇవాళ వచ్చిందని విమర్శించారు. తెలంగాణలోని ప్రతీ గ్రామంలో ఎరువుల కోసం రైతులు చాంతాడంత లైన్లు కడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. యూరియాను అక్రమ పద్ధతుల్లో తరలించి కాంగ్రెస్ నాయకులే బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఎరువుల కొరతపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంగా తీవ్రంగా ఉన్న యూరియా కొరతపై హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. తెలంగాణ రైతులకు కావాల్సిన రెండు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సెప్టెంబర్ 9 లోపు ఇచ్చిన పార్టీ అభ్యర్థికే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇస్తామని ప్రకటించారు.ఇంతవరకు తమను ఏ కూటమీ సంప్రదించలేదని, అయితే తెలంగాణ ప్రయోజనాలకు అనుగుణంగానే తాము నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రేవంత్ అసమర్థత, అనుభవలేమి, ప్రణాళిక రాహిత్యంతోనే రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రమైందని చెప్పారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న పదేండ్ల కాలంలో ఏ ఒక్క రోజు కూడా ఎరువుల కొరత రాలేదని వెల్లడించారు. సీజన్‌కు ఆరు నెలల ముందే 24 గంటల పాటు మానిటరింగ్ చేసి కేసీఆర్ ఎరువులను తీసుకొచ్చేవారని గుర్తు చేశారు. ఎరువులను కొందరు కాంగ్రెస్ నాయకులు బ్లాక్ మార్కెట్లో అమ్ముకుంటున్నారన్న ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. '70 లక్షల మంది తెలంగాణ రైతులు యూరియా కోసం అల్లాడుతుంటే కాంగ్రెస్, బీజేపీలు ఎలక్షన్లు, కలెక్షన్లు అని నాటకాలు ఆడుతున్నాయి. ఎరువుల కొరతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్వేతపత్రం విడుదల చేయాలి. లేకుంటే క్షేత్ర స్థాయి నుంచి రాష్ట్రస్థాయి దాకా పోరాట కార్యాచరణను ప్రకటిస్తాం.

**పైసా ప్రయోజనం కలగడం లేదు..**

తమకు ఢిల్లీలో బాస్‌లు ఎవరూ లేరు.. తెలంగాణ ప్రజలే తమకు బాసులు. ఎనిమిది మంది కాంగ్రెస్, ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉండి కూడా తెలంగాణకు పైసా ప్రయోజనం కలగడం లేదు. రైతు డిక్లరేషన్ పేరుతో నానా హంగామా చేసిన రాహుల్ గాంధీ తెలంగాణ రైతుల యూరియా సమస్యపై పార్లమెంట్‌లో ఎందుకు మాట్లాడం లేదు?. బీసీల మీద ప్రేమ నటించే కాంగ్రెస్ పార్టీ, ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా బీసీ నేతను ఎందుకు ప్రకటించలేదో చెప్పాలి. గత రెండు నెలలుగా తెలంగాణలోని ఏ పల్లె చూసినా ఒక దయనీయ పరిస్థితి కనిపిస్తుంది. ఎరువుల కోసం చాంతాడంత లైన్లో నిలబడి రైతులు అవస్థలు పడుతున్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వానికి చిల్లర రాజకీయాలు చేయడం తెలుసు. బురద చల్లడం తెలుసు. కాని ఒక్క పనికొచ్చే పని చేయడం మాత్రం తెలియదు చాతకాదన్న సంగతి ప్రజలకు స్పష్టంగా అర్థం అయింది ఈ చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వాకంతో ఒక్క బస్తా ఎరువు దొరకక్క రైతులు ఆగమాగం అవుతున్నారు. తాము పండించిన పంటను కొనండి అని అధికారుల కాళ్ళ మీద అన్నదాతలు పడే దుస్థితి ఇవాళ తెలంగాణ వ్యాప్తంగా ఉంది. ఎరువుల బస్తాల కోసం కూడా అధికారుల కాళ్ళ మీద రైతులు పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ చరిత్ర రైతులకు మేలు చేసింది ఏమాత్రం కాదు. ఆనాటి రోజులను మళ్ళీ తీసుకొస్తానని చెప్పిన కాంగ్రెస్ పార్టీ రైతులకు దుర్దినాలను తీసుకొచ్చింది. యూరియా కోసం దుకాణాల ముందు మహిళా రైతులు రాత్రంతా పడిగాపులు పడే పరిస్థితికి తీసుకొచ్చింది.

**ఆరు నెలల ముందే బఫర్ స్టాక్‌ను తీసుకొచ్చి..**

కేసీఆర్ ప్రభుత్వంలో ఆరు నెలల ముందు నుంచే ఎరువుల కోసం ముందస్తు ప్రణాళిక తయారు చేసేవాళ్ళం. ఆరు నెలల ముందే బఫర్ స్టాక్‌ను తీసుకొచ్చి గోదాముల్లో నిలువ చేసి ఇంకా సీజన్ స్టార్ట్ కాకముందే దేశంలో ఎక్కడెక్కడ యూరియా దొరుకుతుందో అక్కడి నుంచి తెప్పించి రైతులకు అందజేశాం. రైతుల కడుపులో సల్ల కదలకుండా ఇంటికి ఎరువుల బస్తాలు పంపాం. మేం అధికారంలోకి వచ్చేనాటికి ఉన్న నాలుగు లక్షల టన్నుల మెట్రిక్ టన్నుల గోదాముల సామర్థ్యాన్ని ఒకటిన్నర సంవత్సర కాలంలోనే 24 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యానికి పెంచాం. ఇప్పుడు గోదాములు ఉన్నాయి, రైతు వేదికలు ఉన్నాయి, కష్టపడే రైతులు ఉన్నారు. కేసీఆర్ ఎంతో కష్టపడి బాగు చేయించిన మిషన్ కాకతీయ చెరువులు ఉన్నాయి, అద్భుతంగా కట్టిన కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులు నీళ్లతో కలకలాడుతున్నాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వానాకాలం సీజన్ మొదలైనా దున్నపోతు మీద వాన పడ్డట్టుగా ఒక సమీక్ష, సన్నద్ధత, ప్రణాళిక లేకుండా ఉంది. రేవంత్ ప్రభుత్వ అనుభవరాహిత్యం, ప్రణాళికరాహిత్యం, పరిపాలన చేతకానితనం రాష్ట్ర ప్రజలకు అర్థం అయింది.ఇతర అంశాల మీద దృష్టి పెట్టడం వల్ల ఇవాళ రాష్ట్రంలో ఎరువుల కొరత తీవ్రంగా ఉంది. రైతులు అవస్థలు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి ఎరువులు సరఫరా చేయమని అడగలేదు.' అని అన్నారు.

# 30 రోజులు జైల్లో ఉంటే
# పదవి ఊడినట్లే..



ఢిల్లీ, మహా

తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధాని, ముఖ్యమంత్రులు, మంత్రులను పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లుతో సహా మూడు బిల్లులను కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా ప్రతిపక్షాల నుంచి పెద్దఎత్తున నిరసన వ్యక్తమైంది. బిల్లుల కాపీలను చింపి అమిత్ షాపైకి విసిరారు. ప్రతిపాదిత బిల్లులు రాజ్యాంగం, సమాఖ్యవాదానికి వ్యతిరేకంగా ఉన్నట్లు విపక్షాలు ఆరోపించాయి. అయితే ఈ బిల్లులను హడావుడిగా తీసుకొచ్చారనే విమర్శలను కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తోసిపుచ్చారు. వాటిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపనున్నట్లు ప్రకటించారు.

**నేరం చేస్తే ఉద్వాసనే**

నేరం చేస్తే ప్రధాని, సీఎంలు, మంత్రులకు సైతం ఉద్వాసన పలికేలా కేంద్రం ఈ మూడు కీలక బిల్లులను తీసుకువచ్చింది. ప్రతిపక్షాల ఆందోళనల మధ్యే బిల్లులను కేంద్ర హోం మంత్రి అమిత్ షా లోక్ సభలో ప్రవేశపెట్టారు. గవర్నమెంట్ ఆఫ్ యూనియన్ టెరిటరీస్ సవరణ బిల్లు, 130వ రాజ్యాంగ సవరణ బిల్లు, జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లులుగా వాటిని పేర్కొన్నారు. ఈ సమయంలో అధికార విపక్షాల మధ్య వాగ్వాదం జరిగింది. కాంగ్రెస్ సహా విపక్ష పార్టీల ఎంపీలు బిల్లు కాపీలు చింపి సభలో విసిరారు. వెల్ దగ్గరికి వెళ్లి చింపిన బిల్లు ప్రతులను టీఎంసీ ఎంపీలు విసిరారు. హోం మంత్రి అమిత్‌షా స్థానం వైపు కూడా విసిరారు. గుజరాత్ హోంమంత్రిగా ఉన్న సమయంలో అమిత్ షా అరెస్టయిన అంశాన్ని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ లేవనెత్తారు. దీన్ని అమిత్ షా ఖండిస్తూ అరెస్టుకు ముందే నైతిక కారణాలతో తాను రాజీనామా చేశానని, కోర్టు నిర్దోషిగా ప్రకటించాకే ప్రభుత్వంలో చేరానని స్పష్టంచేశారు. తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నప్పటికీ, రాజ్యాంగ పదవుల్లో కొనసాగడం తగదని హితవు పలికారు.

**జేపీసీకి సిఫార్సు**

ప్రతిపాదిత బిల్లులను అమిత్ షా, సంయుక్త పార్లమెంటరీ కమిటీకి సిఫారసు చేశారు. ఈ బిల్లులపై విపక్ష సభ్యులకు అభ్యంతరాలుంటే జేపీసీకి వెల్లడించాలని సూచించారు. ఈ క్రమంలో ప్రతిపక్షాల నిరసనలు తెలిపాయి. ఈ గందరగోళం మధ్యలోనే అమిత్ షా మూడు బిల్లుల కోసం ప్రవేశపెట్టిన తీర్మాణానికి లోక్‌సభ ఆమోదం తెలిపింది. దీంతో విపక్షాలు వెల్‌లోకి దూసుకురాగా, సభ వాయిదా పడింది. అయినప్పటికీ ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనలు చేశారు. ఇక ఈ బిల్లులు ప్రకారం, ఐదేళ్ల జైలు శిక్ష పడే కేసుల్లో వరుసగా 30 రోజులు అరెస్ట్ లేదా నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి లేదా మంత్రులు 31వ రోజున తమ పదవిని కోల్పోతారు. ఒకవేళ ఎవరైనా మంత్రి పదవిలో ఉండి అరెస్టైతే వారిని తొలిగించేందుకు 30 రోజుల్లోపు రాష్ట్రపతికి ప్రధాని సిఫారసు చేయకపోయినా 31వ రోజు సదరు మంత్రి పదవిని కోల్పోతారు. ఒక వేళ ప్రధాని 30 రోజుల పాటు అరెస్టైతే ఆయన 30 రోజుల్లోపు రాజీనామా చేయకున్నా 31వ రోజున పదవి కోల్పోతారు.

# ప్రభుత్వాలను కూల్చేందుకే కొత్త బిల్లు

- ప్రజాస్వామ్య సూత్రాలను దెబ్బతీసే విధంగా ఉంది
- 130వ రాజ్యాంగ సవరణ బిల్లు రాజ్యాంగబద్ధమైనది కాదు
- ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కీలక వ్యాఖ్యలు

(మొదటిపేజీ తరువాయి)

బుధవారం లోకసభలో ఈ బిల్లులపై తీవ్ర గందరగోళం చెలరేగింది. ప్రతిపక్ష ఎంపీలు బిల్లుల కాపీలను చించి, సభలో నిరసన వ్యక్తం చేశారు. దీనిపై ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చేందుకే.. కొత్త బిల్లుని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆరోపించారు. పోలీసుల దగ్గర నుంచి ఈడీ, ఐటీ అధికారులను నియమించేదే రూలింగ్ పార్టీ అని, అప్పుడు.. వాళ్లు ఆడిందే ఆట, పాడిందే పాట అన్నట్టు వ్యవహారం సాగుతుందన్నారు. ఐదు ఆరుగురు క్యాబినెట్ మంత్రులను 30 రోజులు జైల్లో పెడితే ప్రభుత్వం పడిపోతుందని చెప్పారు. ఈ ఉద్దేశంతోనే బిల్లు తెచ్చారని, ఇది రాజ్యాంగబద్ధమైనది కాదని అన్నారు. భారతదేశాన్ని ఈ చట్టం ద్వారా పోలీసు రాజ్యంగా మార్చాలని బీజేపీ భావిస్తోందని, ఇది ప్రజాస్వామ్య సూత్రాలను దెబ్బతీసే విధంగా ఉందని మండిపడ్డారు.

## హనీఫ్ కు తెలుగువర్శిటీ
# కీర్తి పురస్కారం

## వచన కవితా విభాగంలో ఎంపిక

వివిధ రంగాల్లోని 48మందికి పురస్కారాల ప్రకటన

మహాపత్రిక సాహిత్య పేజీ నిర్వహిస్తున్న హనీఫ్

(మొదటిపేజీ తరువాయి)



వివిధ రంగాల్లో విశేషమైన కృషి చేసిన 48 మంది ప్రముఖులను ప్రతి యేటా తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారాలతో సత్కరిస్తోంది. విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెల్దండ నిత్యానందరావు అధ్యక్షతన ఏర్పాటైన నిపుణుల సంఘం ఆయా రంగాల ప్రముఖులను పురస్కారాలకు ఎంపిక చేసింది. బుధవారం ఎంపికైన వారిని ప్రకటించారు. వచన కవిత విభాగంలో సయ్యద్ హనీఫ్ కు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తిపురస్కారం దక్కింది. హనీఫ్ మహా పత్రిక సాహిత్య పేజీని నిర్వహిస్తూ తన సాహిత్య నైపుణ్యాన్ని అద్భుతంగా ప్రదర్శిస్తూ ప్రశంసలందుకుంటున్నారు. వీరికి తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి ప్రాంగణంలో త్వరలో పురస్కారాలు అందజేయనున్నట్టు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. పురస్కారంతోపాటు ఒక్కొక్కరికి రూ.5,116 చొప్పున నగదు అందజేసి సత్కరిస్తామని పేర్కొన్నారు. హనీఫ్ ' కవితా లోకానికి కొత్తేం కాదు."ఇక ఊరు నిద్రపోదు" (1995) "ముఖ్ టా" (2002)"పడమటి నీడ"(2009) "నాది దుఃఖం వీడని దేశం" (2021,డిసెంబర్) కవితా సంపుటులు వెలువరించాడు. "ఒక సుకుమార వాక్యం చాలు.ఓ గట్టి 'హగ్'చాలు ఈ ప్రపంచాన్ని జయించడానికి" అనే 'పాజిటివ్ దృక్పథం గల కవి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన హనీఫ్ ఆధునిక తెలుగు కవుల్లో ఒక ప్రత్యేకత సంతరించుకున్నారు. తెలుగు యూనివర్శిటీ కీర్తిపురస్కారానికి ఎంపికైన హనీఫ్ కు ఎఎన్ఎన్ మహా పత్రిక యాజమాన్యం అభినందనలు తెలిపింది.

# గోదావరి

భద్రాద్రి వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసిన అధికారులు

పరిస్థితిపై మంత్రి పొంగులేటి ఆరా



(మొదటిపేజీ తరువాయి)

బుధవారం ఉదయం 8.15 గంటలకు గోదావరి 43 అడుగులకు చేరుకోవడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి 10 గంటలకు 48 అడుగులకు పెరగడంతో రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఎగువనున్న కడెం, శ్రీరామ సాగర్ ప్రాజెక్టు పూర్తిగా నిండటంతో దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. అలాగే గోదావరి ఉపనదులు ప్రాణహిత, ఇంద్రావతి నదులు ఉప్పొంగి గోదావరికి పెద్ద ఎత్తున వరదనీరు వచ్చి చేరుతుంది. దీంతో భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి బాగా పెరిగింది. భద్రాచలం వద్ద గోదావరి 50 అడుగుల వరకూ పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. కాగా ఎటువంటి విపత్తునైనా ఎదుర్కోవడానికి ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికపుడు తెలుసుకుంటున్నారు.

# ముస్లింలు బతకొద్దా?

- దమ్ముంటే బీజేపీ రాష్ట్రాల్లో ముస్లిం రిజర్వేషన్ తీసివేయాలి
- స్వాతంత్రం రాకముందు నుంచే ముస్లింలకు రిజర్వేషన్ ఉంది
- బీజేపీపై ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఫైర్
- కాళేశ్వరం రిపోర్ట్ అసెంబ్లీలో పెడుతాం.. ఆ తర్వాతే కేసీఆర్ కోర్టుకెళ్లాలి



**హైదరాబాద్, మహా:** కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ ఇంకా పబ్లిక్ లో పెట్టక ముందే కేసీఆర్ కోర్టుకు వెళ్లారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. అంటే కేసీఆర్ తప్పిదాలు ఉన్నట్లే భావించాలని ఆయన అభిప్రాయపడ్డారు. బుధవారం ఆయన గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ.. కమిషన్ పై అసెంబ్లీలో పెట్టి చర్చిస్తామని, తర్వాత కేసీఆర్ ఎక్కడికైనా వెళ్ళొచ్చు అని చెప్పారు. కాళేశ్వరంపై జస్టిస్ ఘోష్ కమిషన్ 15 నెలలు విచారణ చేశారని గుర్తు చేశారు. అందులో అన్ని తప్పులు ఉన్నట్లు ఘోష్ కమిటీ చెప్పిందన్నారు. 60 సంవత్సరాల నుండి వర్గీకరణ కోసం మాదిగలు పోరాటం చేశారని, షమీమ్ అక్తర్ తో కమిషన్ వేసి వర్గీకరణ చేసి.. ఎవరి వాటా వారికి కల్పించిందన్నారు. అలాగే క్యాస్ట్ సెన్సు చేయడంతో 46.25 శాతం రాష్ట్రంలో బీసీలు ఉన్నట్లు వివరించారు. రాహుల్ గాంధీ ఆలోచనలు రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి క్యాస్ట్ సెన్సు చేశారని చెప్పారు. అన్ని రాష్ట్రాలు కూడా తెలంగాణలో చేసిన కులగణన చేయాలని అడుగుతున్నారని వివరించారు. బీసీ రిజర్వేషన్ లో ముస్లింలను తీసివేస్తే సపోర్ట్ చేస్తామని బీజేపీ అంటుందని మండిపడ్డారు. గుజరాత్ లో ఉంది.. అన్ని రాష్ట్రాలలో అలాగే ఉందని చెప్పారు.

**సర్వే దేశంలో ఎక్కడా జరగలేదు..**

దమ్ముంటే బీజేపీ రాష్ట్రాల్లో ముస్లింల రిజర్వేషన్ తీసివేయాలని సవాల్ విసిరారు. మీ బీజేపీ పార్టీ జాతీయ పార్టీనా కదా? అని ప్రశ్నించారు. మత పరమైన రిజర్వేషన్ అని బీజేపీ నేతలు అంటున్నారని ఫైర్ అయ్యారు. స్వాతంత్రం రాకముందు నుంచే ముస్లింలకు రిజర్వేషన్ ఉందని, వృత్తి పరంగానే రిజర్వేషన్ ఇస్తున్నాం.. మతపరంగా కాదని తెలిపారు. ముస్లింలలో బీద వారు ఉన్నారని, ముస్లింలు బతకొద్దా అని ప్రశ్నించారు. రాజశేఖర్ రెడ్డి అధికారంలోకి వచ్చాక 4 శాతం ఉపాధి,ఉద్యోగాలలో రిజర్వేషన్ ఇచ్చారని అన్నారు. రేవంత్ రెడ్డి ఇంటి ఇంటి సర్వే చేసి ముస్లింలు బీద వారు ఉన్నట్లు గుర్తించారన్నారు. ఇలాంటి కరెక్ట్ సర్వే దేశంలో ఎక్కడా జరగలేదని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లు కావాలని పెద్ద ఎత్తున అప్లికేషన్లు వచ్చాయని, భూమి ఉన్న వారికి మొదటి దఫా.. భూమి లేని వారికి రెండో దఫా ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని ఆయన వివరించారు.

## కేపీహెచ్‌బీలో
# దారుణం

## వేశ్యకు, విటుడికి గొడవ.. కత్తులతో దాడులు

**హైదరాబాద్ సిటీ, మహా :** హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీలో దారుణం జరిగింది. ఓ వేశ్యకు ఆమెను బుక్ చేసుకున్న విటుడికి మధ్య చెలరేగిన వివాదం కత్తుల దాడికి దారి తీసింది. ఇంతకీ అసలేం జరిగిందంటే.. వివరాలిలా ఉన్నాయి. హయాత్‌నగర్‌కు చెందిన మధుగౌడ్ అనే వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడు మంగళవారం రాత్రి కేపీహెచ్‌బీ పరిధిలోని రోడ్ నెంబర్ 1కు వచ్చాడు. అక్కడ ఓ వేశ్యను బుక్ చేసుకున్నాడు. ఈ సమయంలోనే వీళ్లిద్దరి మధ్య గొడవ చెలరేగింది. దీంతో ఆ వేశ్య తన మరిది సోహైల్‌కు ఈ విషయం చెప్పింది. దీంతో సోహైల్ తన గ్యాంగ్‌తో కలిసి అక్కడికి వచ్చాడు. కత్తితో మధుగౌడ్‌పై దాడి చేశారు. ఈ దాడిలో మధుగౌడ్ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించారు. మధు తండ్రి కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ దాడికి సంబంధించిన దృశ్యాలు సీసీటీవీ ఫుటేజ్‌లో రికార్డయ్యాయి. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. ఆ వేశ్యతో పాటు నిందితులు సోహైల్, అతడి గ్యాంగ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోంది.

# 21 ఏళ్లకే ఎమ్మెల్యే..

- తెలంగాణ శాసన సభల్లో చట్ట సవరణ చేస్తాం
- రాహుల్ గాంధీ ప్రధాని అవ్వగానే బిల్లు తెస్తాం
- రాజీవ్ గాంధీ స్ఫూర్తితో స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లు
- ఆయన తీసుకొచ్చిన సంస్కరణల వల్లే రాష్ట్రం ప్రపంచంతో పోటీ
- రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రాల శాసనసభలకు పోటీ చేసే వయో పరిమితిని 25 ఏళ్ల నుంచి 21 సంవత్సరాలకు తగ్గించేందుకు తమ వంతు కృషి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే అధికారం యువత చేతుల్లో ఉండాలన్న ఉద్దేశంతోనే రాజీవ్ గాంధీ ఓటు హక్కు పరిమితిని 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించారని, అదే స్ఫూర్తితో చట్ట సభల్లో పోటీ చేయడానికి వయోపరిమితిని 21 సంవత్సరాలకు తగ్గించాల్సిన అవసరం ఉందని అన్నారు. భారతరత్న రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని డా. బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం ఎదురుగా ఉన్న వారి విగ్రహానికి ముఖ్యమంత్రి పుష్పాంజలి ఘటించారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఈ దేశంలో యువతకు అవకాశాలు కల్పించడానికి రాజీవ్ గాంధీ అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. చట్ట సభల్లో మహిళలకు సముచితమైన స్థానం కల్పించినప్పుడే సమస్యలపై చర్చించి పరిష్కరించడానికి వీలు కలుగుతుందన్న సంకల్పంతో స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లకు పునాది వేశారని చెప్పారు.

**రాజీవ్ గాంధీ స్ఫూర్తితో ముందుకు వెళ్తాం..**

గాంధీ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న రాజీవ్ గాంధీ దేశంలో పారదర్శకమైన పరిపాలన, నిరుపేదలకు సంక్షేమ పథకాలు చేరడానికి ప్రభుత్వ నిర్ణయాల్లో సాంకేతిక నైపుణ్యాన్ని జోడించారని అన్నారు. రాజీవ్ గాంధీ కంప్యూటర్, టెలికాం రంగాల్లో తీసుకొచ్చిన సాంకేతిక సంస్కరణల వల్ల ఈరోజు తెలుగు రాష్ట్రాల ప్రజలు ప్రపంచంతో పోటీ పడుతున్నారని చెప్పారు. రాజీవ్ గాంధీ హయాంలో హైటెక్ సిటీకి వేసిన పునాది రాయి నేపథ్యం నుంచి క్రమేపీ హైదరాబాద్ ఈరోజు ఐటీ కంపెనీలు, డేటా, జీసీసీ సెంటర్లకు కేంద్రంగా, దేశంలోనే మొట్టమొదటి సిటీగా మారిందని పేర్కొన్నారు. వారి స్ఫూర్తితోనే హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ శ్రేణి అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దుతామని, అమరుడైన రాజీవ్ గాంధీ స్ఫూర్తితో ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. వారిని ఆదర్శంగా తీసుకునే గుండెకాయ లాంటి సచివాలయం ముందు వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, మహ్మద్ షబ్బీర్ అలీ, రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తో పాటు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



ANN తెలుగు
# మహా పత్రిక
03
గురువారం, హైదరాబాద్ | 21-08-2025
జనరల్ వార్తలు | GENERAL NEWS
WWW.MAHAADAILY.COM

# ఢిల్లీ సీఎం రేఖా గుప్తాపై దాడి

## ఫిర్యాదుదారుడిగా వచ్చి చెంపదెబ్బ.. తీవ్రంగా ఖండించిన అధికార, ప్రతిపక్ష నేతలు

న్యూఢిల్లీ, : ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై దాడి జరిగింది. బుధవారం ఉదయం సివిల్ లైన్స్‌లోని సీఎం నివాసంలో 'జన్‌సున్‌వాయ్' కార్యక్రమం నిర్వహిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి అకస్మాత్తుగా వచ్చి దాడి చేశాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు ఢిల్లీ సీఎం కార్యాలయం పేర్కొంది. అయితే నిందితుడు చెంపదెబ్బ కొట్టినట్లు ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. మరోవైపు ఈ ఘటనను అధికార, విపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. 35 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి ఈ దాడికి పాల్పడినట్లు బీజేపీ పేర్కొంది. తొలుత అతడు కొన్ని పేపర్లను సీఎంకు అందించిన తర్వాత ఈ దాడికి పాల్పడినట్లు తెలిపింది. ఫిర్యాదుదారుడు దాడికి పాల్పడిన వెంటనే, సీఎం రేఖా గుప్తాను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. సీఎం నివాసం వద్ద భద్రతా వైఫల్యంపై సైతం విచారణ జరుగుతోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ ఘటనతో సీఎం రేఖా గుప్తా పూర్తిగా షాక్‌లో ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షి తెలిపారు. 'ఈ కార్యక్రమం జరుగుతున్నప్పుడు రేఖ గుప్తా ప్రజల మాటలను వింటున్నారు. వెనక నుంచి శబ్దం వచ్చినట్లు వినిపించింది. మేం తిరిగి చూసే సరికి పోలీసులు దాడి చేసిన వ్యక్తి తీసుకెళ్లారు' అని ప్రత్యక్ష్ సాక్షి అన్నారు. మరోసాక్షి శైలేంద్ర కుమార్ మాట్లాడుతూ, తమ ప్రాంతంలోని మురుగునీటి కాలువపై ఫిర్యాదు చేయడానికి గేటు వద్దకు వచ్చే సరికి గందరగోళం నెలకొందని అన్నారు. తర్వాత తెలిసింది సీఎంను ఎవరో చెంపదెబ్బ కొట్టారని తెలిపాడు.

**'చెంపదెబ్బ కొట్టలేదు'**

సీఎంపై జరిగిన దాడిని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా ఖండించారు. దీని వెనక రాజకీయ కుట్ర ఉందని ఆరోపించారు. 'జన్ సున్‌వాయ్' కార్యక్రమంలో సీఎం ఎప్పటిలాగే ప్రజలతో మాట్లాడుతున్నారు. ఒక వ్యక్తి ఆమె వద్దకు వచ్చి, కొన్ని పేపర్లు అందించాడు. వాటిని తీసుకుంటున్న సీఎంను చేయి పట్టుకున్నాడు. దీంతో కొంచెం తోపులాట జరిగింది. ప్రజలు అతడిని పట్టుకున్నారు. అయితే ఆ వ్యక్తి పోలీసులు విచారిస్తున్నారు. సీఎంను వైద్యులు పరీక్షించారు. ప్రస్తుతం బాగానే ఉన్నారు. కానీ, ఆమె తలపై స్వల్పంగా దెబ్బ తగిలినట్లు అనిపిస్తుంది. చెంపదెబ్బ కొట్టారు అనే కథనాలు వచ్చాయి కానీ అవి కాదు. సీఎం ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. కానీ ఆమె తన కార్యక్రమాలను రద్దు చేసుకోనని చెప్పారు' అని వీరేంద్ర సచ్‌దేవా తెలిపారు.



**ఖండించిన కాంగ్రెస్, ఆప్**

సీఎంపై దాడిని కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు ఖండించాయి. ప్రజాస్వామ్యంలో నిరసన వ్యక్తం చేయవచ్చని, కానీ హింసకు చోటు లేదని పేర్కొన్నాయి. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇది చాలా దురదృష్టకరమని కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేంద్ర యాదవ్ అన్నారు. ముఖ్యమంత్రి మొత్తం ఢిల్లీకి నాయకత్వం వహిస్తారు. ఇలాంటి ఘటనలను ఎంత ఖండించినా సరిపోదని నేను భావిస్తున్నా. కానీ మహిళల భద్రత వాస్తవికతను కూడా బయటపెడుతుంది. ఢిల్లీ ముఖ్యమంత్రి సురక్షితంగా లేకుంటే, సామాన్యులు ఎలా సురక్షితంగా ఉంటార?' అని అన్నారు.

**ముఖ్యమంత్రిపై దాడి కేసులో కీలక ఆధారం**
**నిందితుడికి నేర చరిత్ర.. గుజరాత్‌లో పలు కేసులు నమోదు**

ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై జరిగిన దాడి కేసు విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇది యాదృచ్ఛికంగా జరిగిన దాడి కాదని, పక్కా ప్రణాళికతోనే జరిగిందన్న వాదనలకు బలం చేకూర్చే కీలక ఆధారం పోలీసులకు లభించింది. దాడికి పాల్పడిన నిందితుడు రాజేష్ భాయ్ ఖీమ్జీ భాయ్ సకారియా, ఘటనకు ఒక రోజు ముందు ముఖ్యమంత్రి నివాసం వద్ద రెక్కీ నిర్వహించినట్లు సీసీటీవీ ఫుటేజీలో స్పష్టంగా రికార్డయింది. బుధవారం సివిల్ లైన్స్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి రేఖా గుప్తా 'జన సున్వాయి' కార్యక్రమం నిర్వహిస్తుండగా గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన 41 ఏళ్ల రాజేష్ ఆమెపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన ఢిల్లీ పోలీసులకు ఆగస్టు 19వ తేదీ నాటి సీసీటీవీ ఫుటేజ్ లభించింది. ఈ వీడియోలో నిందితుడు రాజేష్.. షాలిమార్ బాగ్‌లోని ముఖ్యమంత్రి వ్యక్తిగత నివాసం పరిసరాలను పరిశీలించడమే కాకుండా, తన ఫోన్‌లో వీడియో కూడా రికార్డ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఈ దాడి వెనుక కుట్ర కోణం ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మరోవైపు, నిందితుడు రాజేష్‌కు నేర చరిత్ర ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. అతనిపై రాజ్‌కోట్‌లోని భక్తినగర్ పోలీస్ స్టేషన్‌లో మొత్తం ఐదు కేసులు నమోదయ్యాయి. వాటిలో నాలుగు కేసుల నుంచి నిర్దోషిగా బయటపడగా, మరో కేసు కోర్టులో విచారణ దశలో ఉంది. ఈ కేసుకు సంబంధించి తదుపరి విచారణ సెప్టెంబర్ 9న జరగనుంది. ఈ పరిణామాల నేపథ్యంలో, దాడి కచ్చితంగా ముందస్తు ప్రణాళికతో జరిగిందేనని ఢిల్లీ మంత్రులు పర్వేష్ వర్మ, మంజిందర్ సింగ్ సిర్సా ఆరోపిస్తున్నారు. నిందితుడు ముఖ్యమంత్రి జుట్టు పట్టుకుని కింద పడేశాడని, వెంటనే భద్రతా సిబ్బంది, స్థానికులు అప్రమత్తమై ఆమెను రక్షించారని వారు తెలిపారు. ఇంతటి భద్రత నడుమ ఈ దాడి జరగడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ భద్రతా వైఫల్యంపై అంతర్గత విచారణ జరుపుతామని ఢిల్లీ పోలీసులు ప్రకటించారు. నిందితుడిని లోతుగా విచారిస్తున్న పోలీసులు, దాడికి గల అసలు కారణాలను రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ కేసులో మరింత సమాచారం కోసం గుజరాత్ పోలీసులను కూడా సంప్రదించారు.

**దాడికి గల కారణాలపై భిన్న వాదనలు**

ముఖ్యమంత్రిపై సకారియా ఎందుకు దాడి చేశాడనే విషయంపై భిన్నకథనాలు వినిపిస్తున్నాయి. నిందితుడి బంధువు జైల్లో ఉన్నాడని, అతడిని విడుదల చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసేందుకు సీఎం అధికారిక నివాసానికి వచ్చినట్లు వార్తలు వచ్చాయి. ఇందుకు సంబంధించిన వ్యవహారం ప్రస్తుతం కోర్టులో పెండింగ్‌లో ఉందని జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. అయితే వీటిని పోలీసులు ధృవీకరించాల్సి ఉంది. గుజరాత్‌లో నిందితుడి తల్లిని ప్రశ్నించిన అధికారులు, వివరాలు సేకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. తన కొడుకు ఢిల్లీ ముఖ్యమంత్రిని కలిసేందుకు వెళ్లిన విషయం తనకు తెలియదని ఆమె చెప్పినట్లుగా సమాచారం. అయితే అతడు జంతు ప్రేమికుడని, ఇటీవల వీధి శునకాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో అసంతృప్తిగా ఉన్నాడని తెలుస్తోంది. అతని మానసిక పరిస్థితి బాగాలేదని కూడా తెలుస్తోంది.

# మంత్రి పొంగులేటిపై సీఎం ప్రశంసలు

**హైదరాబాద్, మహా :** రాజీవ్ గాంధీ వల్లే ఐటీ రంగంలో చాలా మంది రాణిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రులుగా వ్యవహరించిన నారా చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాత్ర ఉందన్నారు. 1994 నుంచి 2014 వరకు హైదరాబాదను అప్పటి ముఖ్యమంత్రులు అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. గచ్చిబౌలిలో డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు బుధవారం సీఎం శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, గూగుల్‌లాంటి ప్రముఖ సంస్థల్లో తెలుగువారు పెద్ద పదవుల్లో ఉన్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. మన ప్రాంత విద్యార్థులు ఇక్కడే చదువుకోవాలని పలు సంస్థలు నిర్మించారని, హైటెక్ సిటీ కట్టినప్పుడు అవహేళన చేశారన్నారు. హైదరాబాద్ నగరం ఢిల్లీ, ముంబై, బెంగళూరు నగరాలతో కాకుండా సింగపూర్, టోక్యోతో పోటీ పడుతోందని, మన వద్ద అన్ని ఉన్నప్పుడు చిత్తశుద్ధితో పని చేయడం కావాలని, అమెరికాలో మన ఐటీ నిపుణులు పని చేయడం ఆపేస్తే స్తంభించిపోతుందని పేర్కొన్నారు.

**పొంగులేటిపై ప్రశంసలు**

ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ భవనాల నిర్మాణ ఘనత మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిదేనని, ప్రభుత్వం పై భారం పడకుండా అద్భుతంగా ఈ గచ్చిబౌలి కార్యాలయానికి రూపకల్పన చేశారన్నారు. మంత్రి ఏడుమాసాల్లోనే పూర్తిచేయాలని పట్టుదలగా ఉన్నారని, తాను 8 మాసాల్లో పూర్తిచేయాలని సూచిస్తున్నానన్నారు. రాష్ట్రంలో 11 ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణ బాధ్యత పొంగులేటిదేనన్నారు. పొంగులేటి రాత్రింబవళ్ళు కష్టపడయినా వీటిని పూర్తిచేయాలని, ప్రస్తుతం ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారానే ప్రభుత్వానికి రూ.15వేల కోట్ల ఆదాయం వస్తున్నదన్నారు. ఇంతకాలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సరైన సౌకర్యాలు లేవని, ఇపుడు మంత్రి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వీటిని అద్భుతంగా ఫైవ్ స్టార్ లాంటి వసతులతో తీర్చిదిద్దాలన్న ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అన్ని సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పిస్తుందని వివరించారు. గచ్చిబౌలి కార్యాలయాన్ని అపర్ణ కన్ స్ట్రక్షన్స్ రూ. 30కోట్లతో నిర్మిస్తుండడం అభినందనీయమన్నారు. అపర్ణ పేరు చరిత్రలో అలా నిలిచిపోతుందన్నారు. మిగతా సంస్థలు కూడా ముందుకు రావాలన్నారు.



**ఎకానమీ పెంచుతాం**

రాష్ట్రంలో శాంతి భద్రతలతో కూడిన ఉద్యోగ భద్రత ఇచ్చామని, రాబోయే పది సంవత్సరాల్లో వన్ బిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం మూసీ ప్రక్షాళన ఎందుకు అడ్డుకుంటున్నారని, మూసీ మురికిలో బతకాలని పేదలు ఎందుకు అనుకుంటారని ప్రశ్నించారు. తెలంగాణ రైజింగ్ 2047తో అభివృద్ధి చేసుకుందామని, మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ జరగాలని తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకొనే వారికి ప్రజలే అడ్డుకట్ట వేయాలని, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మూసీ ప్రక్షాళన కొంతమందికి ఇష్టం లేదని, తెలంగాణ సమగ్ర అభివృద్ధికి 2047 ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ పాత బస్తీ ఓల్డ్ సిటీ కాదని, ఒరిజినల్ సిటీ అని సీఎం పునరుద్ఘాటించారు మూసీ ప్రక్షాళనతో ఓల్డ్ సిటీకి పూర్వ వైభవాన్ని తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అన్ని సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మించబోతున్నామని, రాష్ట్ర ప్రభుత్వానికి రూపాయి ఖర్చు లేకుండా కార్యాలయాలు నిర్మిస్తున్నామని అన్నారు. నగర అభివృద్ధి అడ్డుకునే వారు మనకు శత్రువేనని, హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకునే వారికి ప్రజలే అడ్డుకట్ట వేయాలని రేవంత్ వ్యాఖ్యానించారు.

**సాదా బైనామాలపై తొలగిన హైకోర్టు స్టే : మంత్రి పొంగులేటి**

రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను దశల వారీగా ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ భవనాల పరిధిలోకి తీసుకువస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. గత ప్రభుత్వం అక్రమంగా తీసుకువచ్చిన ధరణి పోర్టల్ ను ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బంగాళాఖాతంలో కలిపేశామని, దేశంలోని 18 రాష్ట్రాలలో అధ్యయనం చేసి భూభారతి 2025 చట్టాన్ని రూపొందించామన్నారు. రోల్ మోడల్‌గా నిలిచిన ఈ భూభారతి చట్టం మేరకు రైతన్నల , ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు సదస్సులు నిర్వహించగా 8.60 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలపారు. వీటిలో 2లక్షల దరఖాస్తులు పరిష్కారం కాగా సుమారు 4లక్షల సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. రాష్ట్ర హైకోర్టు నిన్ననే ఈ సాదాబైనామాలపై ఉన్నస్టేను తొలగించినందున నిజమైన, అర్హత కలిగిన దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగులేకున్నా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నామని, గత ప్రభుత్వ తప్పులను గమనించి ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారని అన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రగతి సాధనలో సాగుతున్నామని, ఈమేరకు ఒక్కొక్కటిగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని, దానిలో భాగంగానే ఈ ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ భవనాల శంకుస్థాపన అని వివరించారు. ప్రస్తుతం జిహెచ్ఎంసీ, ఓఆర్ ఆర్ పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల రూపేణా సుమారు 6263 శాతం ఆదాయం లభిస్తోందని, వీటిని 11 ఇంటిగ్రేటెడ్ భవనాల పరిధిలోకి తీసుకువస్తామని తెలిపారు. ఈరోజు శంకుస్థాపన చేసుకున్న ఈ భవనం అత్యాధునిక కార్పొరేట్ స్థాయిలో ఉండబోతోందని, సుమారు మూడు ఎకరాలలోని దాదాపు 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 300 కార్లు పార్కింగ్ సౌకర్యం తదితరాలతో నిర్మితమవబోతోందని చెప్పారు. ఫైవ్ స్టార్ సౌకర్యాలు సుమారు 89 నెలల్లో ఈ భవనాన్ని నిర్మిస్తామని నిర్మాణసంస్థ చెబుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్టాంప్స్ మరియు రిజిస్ట్రార్ స్పెషల్ సెక్రెటరీ రాజీవ్ గాంధీ హన్మంతు, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, ఉన్నతాధికారులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో అంగన్వాడీల్లో అల్పాహారం

- **ప్రతి చిన్నారికీ ఉదయం 100 మి.లీ పాలు: మంత్రి సీతక్క**
- **అంగన్వాడీల్లోని వసతులపై అధికారులతో మంత్రి సమీక్ష**
- **అంగన్వాడీ భవనాల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఆదేశం**

**హైదరాబాద్, మహా:** రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ చిన్నారులకు త్వరలో అల్పాహారం పథకం ప్రారంభించనున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. హైదరాబాద్‌లోని 139 అంగన్వాడీ కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేశామని, దీంతో 30 శాతం హాజరు పెరిగిందని చెప్పారు. ప్రతి చిన్నారికీ ఉదయం 100మి.లీ పాలు సరఫరా చేసే ఆలోచన ఉన్నట్లు తెలిపారు. అంగన్వాడీల్లోని వసతులపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. చిన్నారులకు వారంలో కనీసం ఒక రోజు ఎగ్ బిర్యానీ, వెజిటబుల్ బిర్యానీ వడ్డించాలన్నారు. అంగన్వాడీ భవనాల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల తరహాలో ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి అంగన్వాడీ భవనాలకు అనుమతులు మంజూరు చేస్తే ఇప్పటివరకు కేవలం 625 ప్రాంతాల్లోనే స్థలాలు గుర్తించారని తెలిపారు. ఒక్కో అంగన్వాడీ భవన నిర్మాణానికి రూ.12 లక్షలు మంజూరు చేశామని, నిర్మాణాలు పూర్తయిన 22 భవనాలను స్థానిక ఎమ్మెల్యేలతో ప్రారంభోత్సవం చేయించాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు యూనిఫాం చీరల పంపిణీ ప్రారంభించాలని మంత్రి సీతక్క సూచించారు.



# జూబ్లీహిల్స్ ఉపఎన్నిక

## ప్రత్యేక సమ్మరీ రివిజన్‌కు ఈసీ షెడ్యూల్ విడుదల.. జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్

**హైదరాబాద్, మహా :** భారత ఎన్నికల కమిషన్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజక వర్గ ఉప ఎన్నికల కోసం స్పెషల్ సమ్మరీ రివిజన్ కు షెడ్యూల్ విడుదల చేసినట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ తెలిపారు.. బుధవారం జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల కమిషన్ సూచించిన స్పెషల్ సమ్మరీ రివిజన్ ను ఎన్నికల అధికారి వివరించారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమం సెప్టెంబర్ 2 నుండి సెప్టెంబర్ 17 వరకు నిర్వహించనున్నట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ అన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో జూలై 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు తప్పని సరిగా ఓటరు నమోదు చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ 2 నుండి 17 వరకు క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్ అవకాశం ఉందన్నారు. సెప్టెంబర్ 25 వరకు క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్ డిస్పోజల్ చేస్తామన్నారు. సెప్టెంబర్ 30 వరకు ఓటరు జాబితా ఫైనల్ పబ్లికేషన్ చేస్తామని కమిషనర్ వారికి వివరించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ లో రాజకీయ ప్రతినిధులు సహకరించి ఈ ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. వివిధ పార్టీల ప్రతినిధులు సందేహాలను నివృత్తి చేయడమే కాకుండా సూచనలు స్వీకరించి సమగ్ర ఓటరు జాబితా తయారీ చేస్తామన్నారు. అందుకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. బీజేపీ ప్రతినిధులు మర్రి శశిధర్ రెడ్డి, కొల్లూరి ప్రవీణ్ కుమార్, పి.వెంకటరమణ, బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి కె.సందేశ్ కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి మల్లంగి విజయ్, సిపిఎం ప్రతినిధి ఎం.శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు రాజేష్ కుమార్, మహ్మద్ వాజిద్ హుస్సేన్, తెలుగు దేశం పార్టీ ప్రతినిధి ప్రశాంత్ రాజు యాదవ్, ఎం.ఐ.ఎం నుండి సయ్యద్ ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.









మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | ఎడిటోరియల్ | EDITORIAL | గురువారం, హైదరాబాద్ | 21-08-2025
ANN తెలుగు

OPINION ఓపీనియన్

# పాపన్నగౌడ్ అద్భుత రాజనీతిజ్ఞుడు



- నాగరాజు
పీఆర్వో టూ రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు

తెలంగాణ లోని కాంగ్రెస్ ప్రభుత్వం సర్దార్ సర్వాయ్ పాపన్న స్ఫూర్తితో ముందుకు సాగుతోంది. పీడితులు, బహుజనులు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన సామాన్యుడు, గొప్ప సామాజిక బహుజన విప్లవకారుడు, కుల, మత, జాతి వర్గ విభేదాలు లేని సమాజం కోసం దాదాపు 350 ఏండ్ల కిందనే కృషి చేసిన బహుజన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. ఆధిపత్య అగ్రకుల పాలకులు బహుజనులను అణగదొక్కుతున్న 17వ శతాబ్దంలోనే స్వీయ సైన్యంతో దక్కన్‌పై బహుజనుల సంక్షేమ బాధ్యత తీసుకొని తొలి బహుజన రాజ్య స్థాపన చేసిన గొప్ప వీరుడు, తొలి బహుజన రాజు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. ఖిలాష్ పూర్ కేంద్రంగా చేసుకొని మొఘల్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన ఘనుడు. ఒక సామాన్యుడు ఆధునిక ఆయుధాలను సమకూర్చుకొని రాజ్యాధినేతలనే ఎదురించిన ఘనత మన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ది. మహాత్మా జ్యోతిరావు పూలే కంటే ముందే సామాజిక న్యాయం అమలు చేసిన గొప్ప సామాజిక విప్లవకారుడు. రాచరికపు వ్యవస్థ నీడలో అగ్రకులాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా, జమీందార్లు, జాగీర్దాల అరాచకాలను సహించలేక కడుపు మండి కత్తి పట్టిన వీరుడతను. ఖిలాషాపూర్‌ను కేంద్రంగా చేసుకొని మొఘలుల ఆధిపత్యాన్ని ఎదిరించి గోల్కొండ కోటపై జెండా ఎగురవేసిన బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్.

ఛత్రపతి శివాజీ ఉత్తర భారతంలో విదేశీయుల నుంచి దేశాన్ని కాపాడి సంప్రదాయ బూజు పట్టిన వ్యవస్థపై తిరుగు బావుటా ఎగురవేసి, స్వరాజ్యాన్ని సాధిస్తున్న సమయంలో, దక్షిణాదిన భూస్వామ్య, దోపిడీ వ్యవస్థపై తిరుగుబాటు చేసి తెలంగాణ గడ్డపై దళిత, బహుజన, మైనార్టీలతో కలిసి ప్రజారాజ్యాన్ని నిర్మించిన వాడు పాపన్న. అందుకే మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ సమకాలికుడిగా పాపన్నను చెబుతారు. వరంగల్ జిల్లా ఖిలాషాపూర్ నుంచి..కాకతీయుల పాలన ముగిసిన 300 ఏండ్ల తర్వాత 1650 నుంచి 1709 వరకు సర్దార్ సర్వాయి పాపన్న ప్రస్థానం ఉంది. పాపన్న 1650 ఆగస్ట్ 18న వరంగల్ జిల్లా ఖిలాషాపూర్ గ్రామంలో గౌడ కులంలో పుట్టారు. పాపన్న తండ్రి చిన్నతనంలోనే చనిపోతే తల్లి సర్వమ్మ అన్నీ తానై పెంచింది. పాపన్న కల్లు గీత వృత్తి కొనసాగిస్తూ యుక్త వయసులోనే భూస్వాములు, దేశముఖ్ ల దాష్టీకాలను సహించలేక, మూఢ సాంప్రదాయాలను ఎదిరించి పోరుబాట పట్టాడు. అగ్ర కులపెత్తనాన్ని అణచాలంటే ఒక్కరితో సాధ్యం కాదని గుర్తించి, మొత్తం బహుజన కులాలను ఏకం చేయాలనుకున్నాడు. తన స్నేహితులైన చాకలి సర్వన్న, మంగలి మాసన్న, కుమ్మరి గోవిందు, జక్కుల పెరుమాళ్లు, దూదేకుల పీరు, కొత్వాల్ మీర్ సాహేబ్ తో కలిసి చుట్టూ జరుగుతున్న విషయాల గురించి చర్చించేవాడు. వాళ్లకు తన మార్గం, భవిష్యత్తు కార్యాచరణను వివరించి గెరిల్లా సైన్యాన్ని తయారు చేసుకున్నాడు. ధనవంతులు, జమీందారులపై రహస్య దాడులు చేసి కొల్లగొట్టిన ధనంతో మెరుగైన ఆయుధాలను సమకూర్చుకున్నాడు. దొరలు, భూస్వాముల వల్ల బాధలు పడుతున్న వారికి విముక్తి కలిగించి వారితో తన సైన్యాన్ని విస్తరించుకున్నాడు. ఈ క్రమంలోనే ఉత్తర తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో అగ్రకుల భూస్వాములు, ధనవంతుల గడీలు, కోటలపై దాడులు ప్రారంభించాడు. ప్రజల శ్రమను దోపిడీ చేసి కోటల్లో దాచుకున్న ఆస్తులను కొల్లగొట్టి పేద ప్రజలకు పంచిపెట్టి బందీలుగా మగ్గుతున్న అణగారిన వర్గాలను విడిపించాడు. ఈ నేపథ్యంలో పాపన్న సైన్యం అతి తక్కువ సమయంలోనే 12 వేలకు చేరింది. సైనిక శిక్షణ, యుద్ధ విద్యలను నేర్చుకోవడానికి పాపన్న వ్యూహాత్మకంగా అడుగులు వేశాడు. శిక్షణ పొందిన సైన్యం ద్వారా చిన్న చిన్న సంస్థానాలు, గడీలపై మెరుపుదాడులు చేసి వాటిని ఆక్రమించుకుంటూ, తన సొంత ఊరు ఖిలాషాపూర్ ను రాజధానిగా చేసుకుని, 1675లో సర్వాయిపేట కేంద్రంగా తన రాజ్యాన్ని స్థాపించి దుర్భేద్యమైన కోట నిర్మించాడు.

**పాపన్న రాజనీతి**

పాపన్న జైత్రయాత్ర అప్రతిహతంగా కొనసాగి ఆ తర్వాత కరీంనగర్, హుస్నాబాద్, ఎలగందుల రాజ్యాలను జయించాడు. ఇలా రాజ్య విస్తరణ చేసుకుంటూ, తాటికొండలో నిర్మించిన కోట ద్వారా సైనిక కార్యకలాపాలను ఉధృతం చేసి వరంగల్, నల్గొండ జిల్లాల్లోని రాజ్యాలను గెలిచాడు. ఎత్తైన గుట్టలు ఉన్న ప్రాంతాలనే రక్షణ దుర్గాలుగా ఎంచుకున్నాడు. కనుచూపు మేరలో శత్రువు కదలికలను కనిపెట్టేలా కోటల నిర్మాణం చేశాడని, ఆధునిక ఆయుధాలు వాడినట్లు ఆ కోటలపై ఉన్న ఆనవాళ్లను బట్టి తెలుస్తోంది. రాజనీతిలోనూ పాపన్న ఏ చక్రవర్తికీ తీసిపోడు. స్వయం సమృద్ధి కోసం ఎన్నో సంస్కరణలు చేశాడు. తాటికొండ లాంటి ప్రాంతాల్లో వ్యవసాయ అభివృద్ధికై చెక్ డ్యామ్ లను కట్టించాడు. కులవృత్తులను ప్రోత్సహించాడు. హుస్నాబాద్ లో ఎల్లమ్మ చెరువును తవ్వించాడు. ఎల్లమ్మ ఆలయాన్ని నిర్మించాడు. ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో ఎన్నో కోటలు, చెరువులు నిర్మించారు. 1678 వరకు తాటికొండ, వేములకొండలను అధీనంలోకి తెచ్చుకుని విజయ దుర్గాలను నిర్మించాడు. 1708 వరకు మొఘల్ ఏలుబడిలో ఉన్న ఓరుగల్లు, భువనగిరి కోటలను చేజిక్కించుకుని, భువనగిరి, వరంగల్, కొలనుపాక, జఫర్ ఘడ్, చేర్యాల్, బైరానుపల్లి, నల్గొండ, కరీంనగర్, హుస్నాబాద్, హుజూరాబాద్ మొదలు మెదక్ జిల్లా పాపన్నపేట వరకు ఉన్న ప్రాంతాలను తన సామ్రాజ్యంగా చేసుకుని పాలించాడు. ఇలా సర్వాయిపేట కోటతో మొదలుపెట్టి తన అధీనంలోకి వచ్చిన ప్రాంతాల్లో 20 కోటలను నిర్మించాడు. 1700-1705 మధ్యకాలంలో ఖిలాషాపూర్లో మరో దుర్గం నిర్మించాడు. యుద్ధ విద్యల్లో ఆరితేరిన సైన్యాన్ని సమకూర్చుకున్న పాపన్న ఖిలాషాపూర్ కేంద్రంగా రాజ్యపాలన చేస్తుండటంతో ఈ ప్రాంతాల నుంచి రావలసిన పన్నులు తగ్గిపోవడంతోపాటు రాజ్యాలు ఒక్కొక్కటి చేజారుతుండటంతో అప్పటి ఢిల్లీ సుల్తాన్ ఔరంగజేబుకు కలవరం కలిగించింది. పాపన్నను బంధించాలని అప్పటి కొలనుపాక పాలకుడు రుస్తుందిల్ ఖాన్ ను ఆదేశించడంతో తన సైన్యాధినేత ఖాసింఖాన్ ను పాపన్నపై దాడికి పంపించాడు. ఖిలాషాపూర్ పై దాడికి వచ్చిన ఖాసింఖాన్ ను హతమార్చి అతడి సైన్యాలను పాపన్న తిప్పికొట్టాడు. కొంత కాలం తర్వాత ఏకంగా రుస్తుందిల్ ఖాన్ రంగంలోకి దిగి, పాపన్న సైన్యానికి పెద్ద ఎత్తున నష్టం చేసి, ఖిలాషాపూర్ కోటను నేలమట్టం చేశాడని, అనంతర కాలంలో తిరిగి పాపన్న ఖిలాషాపూర్ కోటను మరింత శత్రుదుర్భేద్యంగా మార్చాడు.

ఔరంగజేబు మరణానంతరం దక్షిణాదిన మొఘల్ పాలన మరింత పట్టు తప్పడంతో, పాపన్న గోల్కొండ కోటపై దాడికి పథకం వేస్తున్న తరుణంలో, మొఘల్ రాజు బహదూర్ షా పాపన్నను స్వయం పాలకునిగా సంధికి ఆహ్వానించాడు. సంధికి వచ్చిన పాపన్నను ఎర్ర తివాచీ పరచి గౌరవంగా ఆదరించారని ఆంగ్ల చరిత్రకారుడు టీడబ్ల్యూ హేగ్ తన రచనల్లో పేర్కొన్నారు. కొంత కప్పం చెల్లించి గోల్కొండ కోటకు రాజుగా కొనసాగవచ్చని బహదూర్ షా చేసిన ప్రతిపాదనకు అంగీకరించిన పాపన్న, మొఘల్ చక్రవర్తి కోరిన కప్పాన్ని చెల్లించి గోల్కొండ కోటపై బహుజనుల జెండాను ఎగురవేశాడు. అయితే బహుజనుడైన పాపన్నను గోల్కొండ కోటకు రాజుగా చేయడాన్ని జమీందార్లు, దేశముఖ్ లు, జాగీర్దార్లు జీర్ణించుకోలేకపోయారు. పాపన్నను ఎలాగైనా రాజ్యాధికారం నుంచి తప్పించాలని కుట్రలు పన్నారు. మొఘల్ చక్రవర్తుల రాజ్య విస్తరణను అడ్డుకుని 30 ఏండ్లు తెలంగాణ గడ్డని పాలించిన పాపన్న విజయాలకు బెదిరిపోయిన సుభేదార్లు, మొఘల్ తొత్తులైన భూస్వాములు కుట్ర పన్ని పాపన్న పరిపాలనలో తాము కొనసాగలేమని, ఆయనను పదవి నుంచి తప్పించాలని బహదూర్ షాను వేడుకోవడంతో, పాపన్నను బంధించి తేవాలని ఆయన సైన్యాన్ని ఆదేశించారు. దీంతో యూసఫ్ ఖాన్ రుజ్ బహాని నాయకత్వంలో పెద్ద ఎత్తున మొఘల్ సైన్యం పాపన్నపై మూకుమ్మడిగా దాడికి దిగగా, ఇరు సైన్యాల మధ్య భీకర పోరులో పాపన్న తీవ్రంగా గాయపడి తప్పించుకున్నాడు. తనకు సురక్షిత ప్రాంతంగా భావించి హుస్నాబాద్ ప్రాంతానికి వచ్చి అక్కడ ఎల్లమ్మ గుడిని కట్టించి, రహస్యంగా కల్లు గీత కార్మికుడిగా జీవనం సాగించాడని చరిత్రకారులు చెపుతున్నారు. ఈ తరుణంలో ఒక ద్రోహి అందించిన సమాచారంతో మొఘల్ సైన్యం ఆయనను గుర్తించి బంధించడానికి ప్రయత్నించగా, శత్రువు చేతిలో మరణించడం ఇష్టం లేక పాపన్న ఆత్మహత్య చేసుకున్నాడని ప్రజల్లో ఒక కథనం ఉంది. మరో కథనం ప్రకారం 1709లో ఇరు సైన్యాల మధ్య జరిగిన పోరులో మొఘల్ సైన్యం ఆయనను బంధించి శిరచ్ఛేదనం చేసి తలను బహదూర్ షాకు కానుకగా ఢిల్లీకి పంపి, పాపన్న మొండాన్ని గోల్కొండ కోటకు వేలాడదీశారని మరో కథనం కూడా ప్రచారంలో ఉంది. వివిధ కథలు ప్రచారంలో ఉన్నా ఆయన ఒక యోధుడిగా తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు.

**ప్రభుత్వ నిధులు**

సర్వాయి పేట లో పాపన్న గౌడ నిర్మించిన కోటను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి 4.5 కోట్ల రూపాయలు ప్రభుత్వం విడుదల చేసింది. పాపన్న తవ్వించిన ఎల్లమ్మ చెరువు ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తుంది. సర్వాయి పాపన్న గౌడ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుంది. పాపన్న గౌడ్ స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శంగా ఉండేలా ట్యాంక్ బండ్ పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ,మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో శంకుస్థాపన చేశారు. ఆయన స్ఫూర్తి చరిత్ర భావితరాలకు తెలిసేలా సచివాలయం ఎదుటే దీనికి అంకురార్పణ జరిపారు. పాపన్న పోరాట స్ఫూర్తి.. రాజనీతి స్ఫూర్తిదాయకం.





# మెనోపాజ్ వల్ల బరువు పెరగరా?

## అపోహలకు తెరదించిన గైనకాలజిస్ట్

స్త్రీలలో పునరుత్పత్తి దశ ముగిసే ప్రక్రియనే మెనోపాజ్ అని పిలుస్తారు. సాధారణంగా, వరుసగా 12 నెలల పాటు రుతుస్రావం ఆగిపోయినప్పుడు మెనోపాజ్ వచ్చిందని పరిగణిస్తారు. ఇది సహజంగా జరిగే ప్రక్రియ అయినప్పటికీ, దీని గురించి సమాజంలో ఎన్నో అపోహలు, అపార్థాలు ప్రచారంలో ఉన్నాయి. ఈ అపోహలన్నీ తొలగిస్తే మహిళలు ఈ దశను సానుకూల దృక్పథంతో, సరైన ఆరోగ్య నిర్ణయాలతో స్వాగతించవచ్చని గురుగ్రామ్‌లోని సీకే బిర్లా హాస్పిటల్ గైనకాలజీ డైరెక్టర్ డాక్టర్ ఆస్థా దయాల్ ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మెనోపాజ్ గురించి ఉన్న 7 అపోహలను ఆమె వివరించారు.

**అపోహ 1: మెనోపాజ్ రాత్రికి రాత్రే వచ్చేస్తుంది.**

**వాస్తవం:** మెనోపాజ్ అనేది ఒక్కసారిగా వచ్చేది కాదు. ఇది క్రమంగా జరిగే ప్రక్రియ. దీనికి కొన్ని సంవత్సరాల సమయం పట్టవచ్చు. ఈ దశలో హార్మోన్ల స్థాయిలు స్థిరంగా ఉండవు, దీనివల్ల రుతుస్రావం క్రమరహితంగా మారుతుంది.

**అపోహ 2: ఇది వయసు పైబడిన మహిళలకే వస్తుంది.**

**వాస్తవం:** మెనోపాజ్ వచ్చే సగటు వయసు 45 నుంచి 55 సంవత్సరాలు అయినప్పటికీ, కొంతమంది మహిళలకు జన్యుపరమైన కారణాలు, వైద్యపరమైన జోక్యాలు లేదా అనారోగ్యాల వల్ల త్వరగా (early menopause) రావచ్చు. సరైన సమయంలో వైద్య సహాయం తీసుకోవడానికి ఈ విషయంపై అవగాహన ముఖ్యం.

**అపోహ 3: మెనోపాజ్ వల్ల తీవ్రమైన లక్షణాలు ఉంటాయి.**

**వాస్తవం:** ప్రతి ఒక్కరికీ తీవ్రమైన వేడి ఆవిర్లు, మానసిక మార్పులు లేదా నిద్రలేమి వంటి లక్షణాలు ఉండవు. చాలామందిలో ఈ లక్షణాలు తేలికపాటివిగా ఉంటాయి. వీటిని జీవనశైలి మార్పులు, ఆహారపు అలవాట్లు, కొన్నిసార్లు మందులతో నియంత్రించవచ్చు.

**అపోహ 4: మెనోపాజ్ అంటే లైంగిక చర్యకు ముగింపు పలికినట్టే**

**వాస్తవం:** హార్మోన్ల మార్పులు కోరికలను, యోని ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. కానీ, వైద్యుడితో చర్చించడం, లూబ్రికెంట్స్, హార్మోన్ థెరపీ వంటి చికిత్సల ద్వారా వీటిని సరిచేసుకోవచ్చు. మెనోపాజ్ తర్వాత కూడా చాలామంది మహిళలు సంతృప్తికరమైన జీవితాన్ని గడుపుతారు.

**అపోహ 5: మెనోపాజ్ వల్ల ఆటోమేటిక్‌గా బరువు పెరుగుతారు.**

**వాస్తవం:** హార్మోన్ల మార్పుల వల్ల శరీరంలో కొవ్వు నిల్వల పంపిణీ మారవచ్చు. కానీ మెనోపాజ్ వల్ల మీరు ఆటోమేటిక్‌గా బరువు పెరగరు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, తగినంత నిద్రపోవడం వంటివి ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడానికి చాలా ముఖ్యం.

**అపోహ 6: 40 తర్వాత గర్భం దాల్చలేరు.**

**వాస్తవం:** వరుసగా 12 నెలల పాటు రుతుస్రావం ఆగనంతవరకు మీరు గర్భం దాల్చే అవకాశం ఉంటుంది. ఒకవేళ మీరు గర్భం దాల్చకూడదనుకుంటే, పెరిమెనోపాజ్ సమయంలో కూడా గర్భనిరోధక పద్ధతులను పాటించడం చాలా అవసరం.

**అపోహ 7: హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ (HRT) అందరికీ ప్రమాదకరమే.**

**వాస్తవం:** పూర్తిస్థాయి వైద్య పరీక్ష తర్వాత డాక్టర్ సూచిస్తే చాలామంది మహిళలకు హెచ్ఆర్‌టీ (HRT) సురక్షితమైనది, ప్రభావవంతమైనది. ఈ చికిత్స యొక్క ప్రయోజనాలు, ప్రమాదాల గురించి మీ గైనకాలజిస్ట్‌తో చర్చించడం ముఖ్యం.

# శ్రావణ శోభ

## శ్రావణ మాసం ముగింపు దశకు చేరుకుంటున్న తరుణాన ఒక్కసారి శ్రావణ శోభను చర్విత చరణం చేసుకుందామా?



**మహిళల మాసం**

శ్రావణ మాసం అనేది స్త్రీలకోసం నిర్మితమైన దైవ సృష్టి అని చెప్పవచ్చు. ఈ మాసంలో ప్రకృతి తన మృదుత్వంతో మెరిసిపోతే, స్త్రీ తన సౌందర్యంతో, శ్రద్ధతో, సజ్జనతతో ఆ ప్రకృతికి సమానంగా ప్రకాశిస్తుంది. స్త్రీలందరికీ శ్రావణం పండుగ కాలం, భక్తి కాలం, శింగార కళల ఉత్సవం. ఈ శ్రావణ మాసంలో స్త్రీలు కొత్త చీరలు, ఆభరణాలు ధరించడం ఆనవాయితీ. పల్లెల్లో ఉండే మహిళలు తమ బంగారపు తాడి పూలను జడలో పెట్టుకుంటారు. పసుపు రంగు, ఎరుపు రంగు చీరలు వేసుకొని, చేతులకు గాజులు, మెడలో మంగళసూత్రంతో వెలిగిపోతారు. ఇది కేవలం శోభ కాదు —— ఇది సంప్రదాయం, సౌభాగ్యం.

**సంస్కృతి కి సంకేతం:**

గజ్జెల చప్పుళ్ళు, గాజుల మోగింపు, కుంకుమ పువ్వు వాసనలు —— ఇవన్నీ శ్రావణ మాసపు వనితల సౌందర్యాన్ని మధురంగా మలచే అంశాలు. ఇంటి ముందు రంగవల్లులు వేయడం, తులసి మొక్కకు పూజించడం, చిన్న చిన్న దేవాలయాల వద్ద దీపారాధన చేయడం వంటివి అత్యంత పవిత్ర కార్యాలుగా భావిస్తారు. శ్రావణ శుక్రవారాల్లో గౌరీ దేవికి పూజలు చేయడం, వరలక్ష్మీ వ్రతం చేయడం ద్వారా స్త్రీల ధర్మబద్ధత, భక్తి ప్రస్ఫుటమవుతుంది. పసుపుతో గౌరీ రూపాన్ని తయారు చేసి, ఆమెకు పూలు, నైవేద్యం సమర్పిస్తూ శుభకాంక్షలు కోరుతూ తాంబూలాలు పంచుకుంటారు. స్త్రీలు తమ స్నేహితుల్ని, బంధువుల్ని పిలిచి, వంటకాలతో భోజన సమయాన్ని పండుగలా మలుస్తారు. శ్రావణం వారాలన్నీ గృహిణులకు ప్రీతికరంగా మారతాయి. వారి ముఖాల్లో ఆనందపు చిరునవ్వు, చేతుల్లో విశ్వాసం, హృదయంలో భక్తి వారి ముఖాల్లో విలక్షణ కాంతిని సంతరించుకొంటుంది. ఈ మాసంలో పురాణ వ్రత కథలు పిల్లలకు వినిపించడం, ఉయ్యాలల్లో ఊగుతూ పాటలు పాడడం, పెంపుడు మొక్కల మీద ప్రేమ చూపించడం మహిళల ఆధ్యాత్మ భావనకు, కారుణ్యానికి, భారతీయ సనాతన ధర్మానికి ప్రతీకలుగా నిలుస్తాయి. స్త్రీ ఈ మాసంలో శ్రద్ధగా భక్తితో పూజ చేస్తే, సౌభాగ్యవతి గా, ధనవంతురాలిగా, సంతానసంపన్నురాలిగా నిలుస్తుందట. అందుకే పూర్వీకులు శ్రావణాన్ని "ఆత్మవర్ధక మాసం" గా పరిగణించేవారు.

శ్రావణే స్త్రీ పూజయా, గౌరీ లక్ష్మీ అనుగ్రహమ్।
సౌభాగ్యం చ సంతానమ్, లభతే భక్తినా
ధ్రువమ్॥

**అర్థం:** శ్రావణ మాసంలో స్త్రీ గౌరీ లక్ష్మీ పూజను భక్తితో చేస్తే సౌభాగ్యం, సంతానం, సంతోషం తప్పకుండా లభిస్తాయి.

తదుపరి రేపటి సంచికలో ...

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp- 74369 39999

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**జూలూరుపాడు, ఆగస్టు 20,(మహా):** స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 80వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ విగ్రహానికి వెంగన్నపాలెం మాజీ ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదనరావు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశంలో బడుగు బలహీన వర్గాల వారికి సుపరిపాలన అందించిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందని అన్నారు. ఈ దేశంలో సమాచార, సాంకేతిక రంగాలను అన్ని ప్రాంతాలకు అభివృద్ధి చేశారని, అతి చిన్న వయసులో భారత దేశానికి ప్రధాని అయ్యారని గుర్తు చేశారు. ప్రజా సేవలో భాగంగా 1991లో తమిళనాడు రాష్ట్రం పెరుంబదూర్ కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభలో, ఎల్టిటి తీవ్రవాదుల దాడిలో దేశం కోసం, ప్రజల కోసం ప్రాణాలు అర్పించారని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వేల్పుల నరసింహారావు, రామిశెట్టి నాగేశ్వరరావు, నున్న రంగారావు, రామిశెట్టి రాంబాబు, కొండెం జోగారావు, అచ్చయ్య, మాచినేని సత్యనారాయణ, చంద్రా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రి రాళ్ల వాగుకు సింగరేణి నిధులతో బ్రిడ్జిని నిర్మించాలి

### చెన్నూరు ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద స్పందించాలి



**మందమర్రి, మహా :** ఊరు మందమర్రి రాళ్ల వాగుకు సింగరేణి డి ఎం ఎఫ్ టి నిధులు కేటాయించి బ్రిడ్జిని నిర్మించాలని డిమాండ్ చేస్తూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేసి స్థానిక మున్సిపల్ డి ఈ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షులు వాసాల సంపత్ మాట్లాడుతూ ఊరు మందమర్రి రాళ్లవాగు అవతల మామిడిగూడెం, తెలుగు గూడెం, ధర్మారం, పెద్ద ధర్మారం తదితర గ్రామాల ప్రజలు నివసిస్తున్నారని వెల్లడించారు. సింగరేణి కాలరీస్ కంపెనీ పరివాసిక ప్రాంతాలలో వివిధ గ్రామాలను అభివృద్ధి పరుస్తున్నామని అందుకొరకు వందలాది కోట్ల రూపాయలు విడుదల చేస్తున్నామని ప్రకటనలు జారీ చేయడం తెలిసిందే. అయితే ఇక్కడి బ్రిడ్జిని సింగరేణి యాజమాన్యం ఎందుకు నిర్మించలేదని ఆయన ప్రశ్నించారు. ఈ బ్రిడ్జి లేకపోవడం వల్ల పాఠశాలకు వెళ్లే విద్యార్థిని, విద్యార్థులు, నిత్యవసర సరుకులు కొనుగోలు చేసేందుకు తదితరులకు, ఆసుపత్రులకు వెళ్లి ఎందుకు మందమర్రికి వచ్చే గ్రామవాసుల పరిస్థితులు ఆగమ్య గోచరంగా ఉన్నాయని విమర్శించారు. ఇప్పటివరకు ఈ గ్రామ వాసుల గురించి పట్టించుకున్న నాధుడే కరువయ్యారని ధ్వజమెత్తారు. తక్షణమే చెన్నూరు ఎమ్మెల్యే కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద స్పందించి సింగరేణి డి.ఎం.ఎఫ్.టి నిధులు కేటాయించి బ్రిడ్జిని నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతం పలు డిమాండ్ తో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ డి.ఈ. సుమతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.కే. జయ, జూపాక సంధ్య, సామ నగేష్, సత్యనారాయణ, మమత, శారద, నాగమణి, సిహెచ్ రాజేష్, వెంకటస్వామి, లింగమ్మ, బాలరాజు, కిషన్, రమేష్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**హుజూర్ నగర్ టౌన్. ఆగస్టు 20 ( మహా )** భారతీయ రాజనీతిజ్ఞుడు ఏఐసీసీ మాజీ అధ్యక్షులు సమాచార విప్లవ పితామహుడు భారతరత్న అవార్డు గ్రహీత స్వర్గీయ రాజీవ్ గాంధీ 81 వ జయంతి సందర్భంగా హుజూర్ నగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన నాయకులు, కార్యకర్తలు అనంతరం రాజీవ్ గాంధీ గారు భారతదేశానికి చేసిన సేవలను కొనియాడిన పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తన్నీరు మల్లికార్జున్ రావు. INTUC రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్, సీనియర్ మరియు యువ నాయకులు, తదితరులు.



### ప్రశాంత వాతావరణంలో గణేష్

## నవరాత్రులు జరుపుకోవాలి

### మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి వెల్లడి

**మందమర్రి, మహా :** ప్రశాంత వాతావరణంలో గణపతి నవరాత్రులు జరుపుకోవాలని మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి వెల్లడించారు. బుధవారం మందమర్రి పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భద్రత, బందోబస్తుల కొరకు గణేష్ ఆన్లైన్ నమోదు విధానాన్ని తెలంగాణ రాష్ట్ర పోలీసులు తెరమీదికి తీసుకు వచ్చారని అన్నారు. గణపతి మండలాల పూర్తి సమాచారం విగ్రహాల ఏర్పాటు, ఊరేగింపులకు అనుమతి కోసం తప్పనిసరిగా ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్లైన్‌లో దరఖాస్తు చేయు విధానం: అధికారిక లింక్: https://policeportal.tspolice.gov.in/ పైన ఇచ్చిన లింక్‌ను క్లిక్ చేసి, అందులో ఈ క్రింది వివరాలను పూర్తిగా నమోదు చేయాలని కోరారు. దరఖాస్తుదారుని వివరాలు, విగ్రహం ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, పోలీస్ స్టేషన్ పరిధి, విగ్రహం మండపం ఎత్తు, కమిటీ సభ్యుల పేర్లు, వారి ఫోన్ నెంబర్లు, చిరునామా, విగ్రహ ప్రతిష్ట రోజు, నిమజ్జనం చేసే రోజు, సమయం, ప్రదేశం, నిమజ్జనానికి ఉపయోగించే వాహనం వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని పేర్కొన్నారు. గణేష్ మండపాల పూర్తి బాధ్యత నిర్వాహకులదేనని చెప్పారు. మండపాలకు వినియోగించే విద్యుత్ నీ సంబంధిత శాఖ వారి అనుమతితో తీసుకోవాలని అన్నారు. అలాగైతే ఇలాంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నివారించడానికి వీలవుతుందని వివరించారు. ప్రతీ మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు స్పీకర్లను వినియోగించరాదని తెలిపారు. ముఖ్యంగా మండపాల్లో శోభాయాత్ర సందర్భంగా (డీజే) సౌండ్ సిస్టం లను ఏర్పాటు చేయడంపై పూర్తి నిషేధం విధించినట్లు వెల్లడించారు. ఈ సూచనలు పాటిస్తే పవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉంటుందని చెప్పుకొచ్చారు.

## అధికార యంత్రాంగం, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

### కాళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ



**కాటారం, మహా :** భూపాలపల్లి జిల్లాలో గోదావరి నది వరద కి వరద పోటెత్తుతోంది.నీటి మట్టం పెరుగుతుండడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసునట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం కాళేశ్వరంలో గోదావరి, సరస్వతి ఘాట్ల వద్ద వరద ఉధృతిని ఎస్పి కిరణ్ ఖరే తో కలిసి పరిశీలించారు. బుధవారం ఉదయం 7 గంటలకు సి డబ్ల్యూసి నివేదిక ప్రకారం 12.220 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజల ప్రాణరక్షణలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, విద్యుత్, ఆరోగ్య తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. బుధవారం కాళేశ్వరంలో గోదావరి, సరస్వతి ఘాట్ల వద్ద వరద ఉధృతిని ఎస్పి కిరణ్ ఖరే తో కలిసి పరిశీలించారు. నది పరివాహక గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలకు ముందుగానే సమాచారం అందించడంతో పాటు లోతట్టు ప్రాంతాల ప్రజలను గుర్తించి సురక్షిత ప్రాంతాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించే చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అత్యవసర పరిస్థితులలో సేవలు అందించడానికి ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్డీ ఆర్ ఎస్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు యంత్రాంగం పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అత్యవసర సేవలకు కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన 9030632608 నంబర్ కు కాల్ చేయాలని ఆయన సూచించారు.

## ఆగస్టు 22న మినీ జాబ్ మేళా

### మంచిర్యాల జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ

**మంచిర్యాల, మహా:** మంచిర్యాల మిమ్స్ డిగ్రీ కళాశాలలో ఆగస్టు 22 న ఉదయం మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ ఆర్యవర్త ఇన్ఫోటెక్ సంస్థలో మంచిర్యాల ప్రాంతంలో 100 ఎక్స్. ఎం.ఎల్., ఈ.పి.యు.బి. ప్రోగ్రామర్ పోస్టుల భర్తీ కొరకు 1830 సంవత్సరాల వయసు, ఏదేని డిగ్రీ కలిగిన పురుషులు/మహిళ అభ్యర్థులు అర్హులని వెల్లడించారు. దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలతో ఉదయం 10 గంటల 30 నిమిషాలకు జాబ్ మేళాకు హాజరుకావాలని తెలిపారు. ఇతర వివరాలకు 9949084387, 9110368501, 7702284181, 9963452486 నంబర్లలో సంప్రదించవచ్చని, ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**హుజూర్ నగర్ టౌన్. ఆగస్టు 20 ( మహా):** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 81 వ జయంతి వేడుకలు హుజూర్ నగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాజీవ్ గాంధీ భారతదేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తన్నీరు మల్లికార్జున్ రావు, ఐఎన్ టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఎరువుల పంపిణీ పారదర్శకంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**కాటారం, మహా :** భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్‌లోని పి.ఏ.సి.ఎస్ ఎరువుల దుకాణాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా దుకాణంలో ఎరువుల నిల్వలు, రైతులకు అందజేస్తున్న విధానం, రికార్డులను పరిశీలించారు. రైతులకు అవసరమైన ఎరువులు సరిపడ మోతాదులో అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఎరువుల పంపిణీలో ఎటువంటి లోపాలు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. రైతుల అవసరాలను బట్టి తక్షణమే సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాంత రైతులకే ఇవ్వాలని, బయటి రైతులకు ఇవ్వొద్దని ఆదేశించారు. ఈ సందర్భంగా పట్టా దారు పాసు పుస్తకాలు లేని రైతులకు ఏ విధంగా ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. సాగు విస్తీర్ణాన్ని బట్టి 2 నుండి 3 బస్తాలు ఇస్తున్నామని తెలిపారు. ప్రయివేటు డీలర్లు యూరియాకు ఇతర ఎరువులు లింకు పెట్టి ఇవ్వొద్దని అలా చేస్తే పోలీస్ కేసులు నమోదు చేయడంతో పాటు లైసెన్స్ రద్దు చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. పంటలకు ఒకే సారి యూరియా వేయకుండా విడతల వారిగా ఏ మేరకు వినియోగించాలో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. టాస్క్ ఫోర్స్ టీములు ఎరువుల విక్రయాలు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, ఎక్కడైనా కొరత ఏర్పడితే ప్రత్యాన్మయ ఏర్పాట్లు తో సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏ సీఎస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, వ్యవసాయ శాఖ ఏఓ సుప్రజ్యోతి పాల్గొన్నారు.



## మార్లవాయి ఆశ్రమ పాఠశాలలో ఇంచార్జ్ మంత్రి జూపల్లి బస

**కుమురం భీం ఆసిఫాబాద్ మహా :** జిల్లా పర్యటనలో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు మార్లవాయి ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని వసతి గృహాల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి విద్యార్థులతో మాట్లాడుతూ వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు.మంత్రి విద్యార్థులతో పాటు హాస్టల్ గదిలోనే రాత్రి బస చేసి వారికి ధైర్యం నింపారు. విద్యార్థుల తిండి, వసతి, పాఠశాల నిర్వహణపై పూర్తి అవగాహన ఏర్పరచుకుని తక్షణమే లోపాలను సరిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు కోసం కట్టుబడి ఉందని. ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి ఒక్కరికీ మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య అందించడమే తమ లక్ష్యమన్నారు. మంత్రి తమతో కలిసి రాత్రంతా గడపడం పట్ల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేసారు. తమ సమస్యలు వినిపించడానికి అవకాశం దొరకడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భనలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## వరదల్లో చిక్కుకున్నాం మాకు సాయం చేయండి ప్రభో

### మంచిర్యాల జిల్లా నుండి విహారయాత్రకు వెళ్లిన వాసుల గోడు

### తక్షణ చర్యలకు భాజపా నాయకుల స్పందన



**మంచిర్యాల, మహా :** కర్ణాటక, మహారాష్ట్ర తీర్థయాత్రలకు వెళ్లిన మంచిర్యాల జిల్లాకు చెందిన 33 మంది యాత్రికులు వరదల్లో చిక్కుకున్నాం సాయం చేయండి మహా ప్రభో అంటూ వారి గోడును వెళ్లే బోసుకుంటున్న వైనం బుధవారం సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తుంది. వివరాల్లోకి వెళితే...మంచిర్యాల జిల్లా కేంద్రం నుండి 14 మంది, గోదావరిఖని నుండి 4, కరీంనగర్ నుండి నలుగురు మొత్తము పెద్దలు, పిల్లలతో 33 మంది కర్ణాటక, మహారాష్ట్ర, కుకీ, గోకర్ణం, గోవా ఇతరాత్ర తీర్థయాత్రలకు ఆగస్టు 13 రాత్రి మంచిర్యాల నుండి వెళ్లినట్లు తెలుస్తోంది. వీరు ఆయా ప్రాంతాలను సందర్శించి తిరిగి వస్తుండగా మహారాష్ట్ర రతన్ బహుడ గ్రామంలో మంగళవారం ఉదయం 10 గంటలకు నిలిచిపోయామని బాధితులు పేర్కొంటున్నారు. ముందర ఒక బ్రిడ్జిపై ఏడు ఫీట్ల ఎత్తు నుండి నీటి ప్రవాహం వెళుతుందనే కారణంతో ఆగినట్లు చెప్పారు. తక్షణ సహాయం కొరకు స్థానిక పోలీసులకు ఫోన్ చేసిన సాయం అడిగినా వారు సరిగ్గా స్పందించడం లేదని ఆరోపించారు. 24 గంటలుగా తాగునీరు, భోజనం, విద్యుత్ లేదని కారణంగా పిల్లలకు జ్వరాలు వచ్చాయని రోధిస్తున్నారు. మాకు ఏం చేయాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక తాసిల్దార్, పోలీసులు ఇంకా మూడు రోజుల వరకు ఇక్కడే ఉండాలని చెబుతున్నారని పేర్కొన్నారు. తమను తెలంగాణ ప్రభుత్వం కానీ, మంచిర్యాల జిల్లా కలెక్టర్, వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఆదుకోవాలని కోరుతూ వరద ముంపు బాధితులు సెల్ఫీ వీడియో విడుదల చేశారు. ఏది ఏమైనా వీరి విహారయాత్ర వారి వారి కుటుంబాల్లో విషాదం మిగిల్చిందనే చెప్పవచ్చు. సామాజిక మాధ్యమాల్లో చోటు చేసుకున్న ఈ ఘటనపై మంచిర్యాల జిల్లా బిజెపి మాజీ అధ్యక్షులు రఘునాథ్ ఎర్రబెల్లి స్పందించినట్లు సమాచారం. మహారాష్ట్ర ఎమ్మెల్యే తో మాట్లాడి తక్షణ చర్యల తీసుకోవాలని కోరినట్లు తెలుస్తోంది.

## సిర్పూర్ ఎమ్మెల్యే సత్యాగ్రహ దీక్షకు మద్దతు




**కాగజ్ నగర్ మహా :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో నిరవధిక సత్యాగ్రహ దీక్ష చేపట్టిన బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబుకు మద్దతు పెరుగుతోంది. బుధవారం మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేసరి ఆంజనేయులు గౌడ్ ఎమ్మెల్యే నివాసాన్ని సందర్శించి దీక్షకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాభిప్రాయం తీసుకోకుండా, శాస్త్రీయ పద్ధతి అనుసరించకుండా, ప్రజల ఇష్టానికి విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీ.ఓ. నెంబర్ 49 ను వెంటనే రద్దు చేయాలని అని డిమాండ్ చేశారు. మే 30న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తడోబా రిజర్వ్ ఫారెస్ట్‌ను కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్‌లో విలీనం చేస్తూ, కాగజ్‌నగర్ పరిధిలోని 334 గ్రామాలను రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించడం పూర్తిగా అక్రమం అని ఆయన పేర్కొన్నారు. ఇది ప్రజల జీవనోపాధికి ముప్పు అని,గిరిజనులు,రైతుల భవిష్యత్తును దెబ్బతీసే చర్యగా ఆయన అభివర్ణించారు. బీజేపీ ,కొమురం భీం పోరాట స్ఫూర్తితో, ప్రజాసంఘాలతో కలసి జీవో 49 రద్దు కోసం పోరు కొనసాగిస్తామన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం దిగొచ్చి జీ.ఓ. రద్దు చేసేంతవరకు తమ పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వై. కృష్ణకుమారి, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి జైపూర్ నవీన్ గౌడ్, మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు కోండ్ర మనోహర్ గౌడ్, జిల్లా కార్యదర్శి సమీర్ గుప్తా పాల్గొన్నారు.



## వరద నష్టంపై మంత్రి జూపల్లి సమీక్షా సమావేశం

**కుమ్రం భీం ఆసిఫాబాద్ మహా :** ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల జిల్లా వ్యాప్తంగా ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ముఖ్యమైన సమీక్షా సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ వెంకటేష్ దొత్రే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తొలిసారిగా ఆసిఫాబాద్ జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ఆయనకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.సమీక్షా సమావేశంలో వరదల వల్ల కలిగిన నష్టాలను ఎమ్మెల్యే కోవ లక్ష్మి వివరించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు బాధితుల సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వం వీలైనంత త్వరగా చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. బాధితులెవరు అధైర్యపడవద్దన్నారు. ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని తెలిపారు. దెబ్బతిన్న రోడ్లు కల్వర్టులకు వెంటనే మరమ్మత్తులు చేసి రాకపోకలు పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, అదనపు కలెక్టర్లు దీపక్ తీవరి, డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఎస్పీ కాంతి లాల్ పాటిల్‌తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వరద కారణంగా దెబ్బతిన్న రహదారుల పనులు త్వరగా చేపట్టాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో కురిసిన వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారుల పనులు త్వరగా చేపట్టి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం జిల్లాలోని భీమారం మండలం పరిధిలో గల బూరుగుపల్లి నుండి దాంపూర్ కు వెళ్లే దారిలో గర్రెపల్లి సమీపంలో దెబ్బతిన్న రహదారిని మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్, ఉప తహసిల్దార్ అంజమ్మ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత వారం రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులను పరిశీలించి పనులు చేపట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్ష పరిస్థితుల నేపథ్యంలో ప్రజారక్షణ దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, నది తీరాలకు ఎవరు వెళ్లకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పిస్తున్నామని వెల్లడించారు. తక్షణ సహాయం కోసం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 24 గంటలు అందుబాటులో అత్యవసర సేవలకు వివరించారు. ఇందు కొరకు 90 మంది సభ్యులతో 3 ఎస్.డి.ఆర్.ఎఫ్. బృందాలు, రక్షణ పరికరాలతో సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులను పరిశీలించారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఇందులో భాగంగా స్థానిక ప్రజలకు మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, రిజిస్టర్లు, వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారంతో పాటు శుద్ధమైన త్రాగునీటిని అందించాలని సూచించారు. ఈ సీజన్ లో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జూనియర్ కళాశాల వరకు నవీకరించిన నేపథ్యంలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## మంత్రిని కలసిన రెబ్బెన కాంగ్రెస్ శ్రేణులు



**కుమ్రం భీం ఆసిఫాబాద్ మహా:** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావును రెబ్బెన మండల కాంగ్రెస్ నాయకులు కలిశారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆధ్వర్యంలో సింగరేణి కార్మికుల సమస్యలపై మంత్రికి వినతిపత్రం సమర్పించారు. గోలేటి పట్టణంలో సింగరేణి కార్మికులకు తాగునీటి సమస్యలు అధికంగా ఉన్నందున వెంటనే ఆర్ఓ ప్లాంట్ నిర్మించాలని కోరారు. అలాగే సింగరేణి సంస్థకు చెందిన క్వార్టర్లలో అద్దెకు నివాసముంటున్న కుటుంబాలకు కిరాయి తగ్గించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.మంత్రి వారి వినతిని సానుకూలంగా స్వీకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో యూనియన్ కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ సంగెం ప్రకాశ్ రావు, సెంట్రల్ నాయకుడు నల్లగొండ సదాశివ్, రెబ్బెన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లవుడియా రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లవుడియా పల్లాస్, సీనియర్ యువనాయకుడు గుంపుల విమలేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఫ్యామిలీకంతా రూ.కోటి ఉన్నా చాలు..
# హెచ్‌డీఎఫ్‌సీ కొత్త ఆప్షన్

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (HDFC Bank) తన ప్రీమియం "ఇంపీరియా" ప్రోగ్రామ్‌కు సంబంధించి కొత్త అర్హత ప్రమాణాన్ని ప్రకటించింది. అక్టోబర్ 1, 2025 నుంచి, కస్టమర్లు రూ.1 కోటి "టోటల్ రిలేషన్‌షిప్ వాల్యూ (TRV)" ఆధారంగా కూడా ఈ ప్రోగ్రామ్‌కు అర్హత పొందవచ్చు. ఇది వ్యక్తిగత ఖాతాలకే కాకుండా, కుటుంబ సభ్యులు లేదా బిజినెస్ గ్రూప్‌లతో కలిపి ఉన్న మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుంటుంది. ఇంతకు ముందు హెచ్‌డీఎఫ్‌సీ ఇంపీరియా ప్రోగ్రామ్‌లో టీఆర్‌వీ ఆధారంగా అర్హత పొందాలంటే, రూ.1 కోటి విలువను వ్యక్తిగత ఖాతా స్థాయిలో నిర్వహించాల్సి ఉండేది. అంటే, ఒక కస్టమర్‌కి చెందిన సేవింగ్స్, ఎఫ్‌డీ, పెట్టుబడులు, లోన్లు, డీమాట్, ఇన్సూరెన్స్ ప్రీమియం మొదలైనవి కలిపి రూ.1 కోటి టీఆర్‌వీ ఉండాలి. తాజా మార్పు ప్రకారం.. గ్రూప్ స్థాయిలో రూ.1 కోటి టీఆర్‌వీ ఉంటే సరిపోతుంది. కుటుంబ సభ్యులు లేదా బిజినెస్ ఎంటిటీల ఖాతాలు కలిపి ఈ విలువ చేరవచ్చు. టీఆర్‌వీ కాకుండా ఇతర అర్హత మార్గాల ద్వారా హెచ్‌డీఎఫ్‌సీ ఇంపీరియా ప్రోగ్రామ్‌లో చేరాలంటే కరెంట్ ఖాతాలో రూ.15 లక్షల సగటు త్రైమాసిక బ్యాలెన్స్ నిర్వహించాలి. అదే సేవింగ్స్ ఖాతాలో అయితే రూ.10 లక్షల సగటు నెలవారీ బ్యాలెన్స్ ఉండాలి. ఎఫ్‌డీ, సేవింగ్స్, కరెంట్ ఖాతాలన్నీ కలిపి అయిఏత రూ.30 లక్షల సగటు బ్యాలెన్స్ ఉండాలి. హెచ్‌డీఎఫ్‌సీ కార్పొరేట్ ఖాతాల్లో రూ.3 లక్షల పైగా నెలవారీ జీతం జమయ్యేవారికి కూడా ఇంపీరియా ప్రోగ్రామ్ ప్రయోజనాలు లభిస్తాయి.

**ఇంపీరియా ప్రోగ్రామ్.. దాని ప్రయోజనాలు**

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఇంపీరియా ప్రోగ్రాం అనేది హైవ్యాల్యూ కస్టమర్ల కోసం రూపొందించిన ప్రీమియం బ్యాంకింగ్ సేవల ప్యాకేజీ. దీని ముఖ్యమైన ప్రయోజనాలు కస్టమర్‌కు ప్రత్యేకత, ప్రాధాన్యత, ఆర్థిక సౌలభ్యాన్ని అందిస్తాయి.

**ప్రత్యేక రిలేషన్‌షిప్ మేనేజర్:**
వ్యక్తిగతంగా సేవలు అందించే రిలేషన్‌షిప్ మేనేజర్ పెట్టుబడులు, లోన్లు, ఇన్సూరెన్స్ వంటి అంశాల్లో గైడెన్స్

**వెల్త్ అడ్వయిజరీ సేవలు:**
ఫైనాన్షియల్ ప్లానింగ్, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ మార్కెట్ ట్రెండ్స్ ఆధారంగా సలహాలు

**ఉచిత, తగ్గింపు సేవలు:**
చెక్‌బుక్, స్టాప్ పేమెంట్, ఇంటర్‌బ్రాంచ్ ట్రాన్స్‌ఫర్ వంటి సేవలు ఉచితం
మొదటి లాకర్ ఉచితం, రెండవది 50% తగ్గింపు

**ప్రాధాన్యత ధరలు:**
ఫారెక్స్ ట్రాన్సాక్షన్లు, లోన్లు, ఎఫ్‌డీలు, ఇతర ఉత్పత్తులపై ప్రత్యేక రేట్లు

**ప్రత్యేక ఆఫర్లు, ప్రోమోషన్లు:**
హెచ్‌డీఎఫ్‌సీ భాగస్వామ్య బ్రాండ్స్ వద్ద క్యాష్‌బ్యాక్‌లు, రివార్డ్ పాయింట్లు, రివార్డ్‌పాయింట్లు, లైఫ్‌స్టైల్ బెనిఫిట్లు

# సేమ్ షాక్: ఎయిర్‌టెల్‌లోనూ ఆ ప్లాన్ కనుమరుగు




టెలికాం సర్వీస్ ప్రొవైడర్ భారతీ ఎయిర్‌టెల్ తన ఎంట్రీ సెగ్మెంట్ ప్రీపెయిడ్ ప్లాన్‌ను నిలిపివేసింది. ప్రత్యర్థి సంస్థ జియో కూడా రూ.249 ధర గల ఎంట్రీ లెవల్ ప్లాన్ ను నిలిపివేసింది. ఎక్కువ మంది రీచార్జ్ చేసుకునే ఈ ప్లాన్ ను ఎయిర్‌టెల్ నిశ్శబ్దంగా కనుమరుగు చేసింది. ఇప్పుడు వారు రూ .299 ధర గల ఖరీదైన ప్రీపెయిడ్ ప్లాన్ ను ఎంచుకోవలసి వచ్చింది. ఎయిర్ టెల్ నిలిపివేసిన ఈ ప్లాన్ ధర రూ.249. ఇది 28 రోజుల పాటు రోజుకు 1 జీబీ డేటా, అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్ లను అందించేది. ముఖ్యంగా, ఇది వినియోగదారులకు ఉచిత హలోట్యూన్స్, ప్రో ఏఐ, ఎక్స్‌ట్రీమ్ ప్లే వంటి ప్రయోజనాలను కల్పించేది. 28 రోజుల పాటు రోజుకు 1 జీబీ డేటాను అందించే రూ.249 ప్లాన్ ను జియో కూడా ఇటీవల తొలగించింది. జియోలో ఇకపై 1 జీబీ రోజువారీ డేటా లిమిట్‌తో ఎలాంటి ప్లాన్ లేదు. చౌకైన 28 రోజుల ప్లాన్ ఇప్పుడు రూ .299 నుండి ప్రారంభమవుతుంది. ఇది రోజుకు 1.5 జిబి డేటాను అందిస్తుంది. ఈ చర్య ఎయిర్‌ల్, జియోలకు సగటు వినియోగదారుడి ఆదాయాన్ని (ఏఆర్‌పీయూ) పెంచుతుండగా, సామాన్యులపై ఖరీదైన ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్‌ల భారం పడుతోంది. ఈ రెండు టెలికాం ఆపరేటర్లు తీసుకున్న నిర్ణయాన్ని మరో ప్రైవేట్ టెలికం కంపెనీ వొడాఫోన్ ఐడియా కూడా అనుసరించే అవకాశం ఉంది.

## గూగుల్ పే, ఫోన్‌పే యాప్‌లలో
# కీలక మార్పు




యూపీఐ మోసాలను అరికట్టేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 1 'పేమెంట్ రిక్వెస్ట్' ఫీచర్‌ను నిలిపివేయాలని నిర్ణయించింది. గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం వంటి యూపీఐ యాప్‌లలో ఈ మార్పు అమలులోకి రానుంది.

**మోసాల వెనుక ఉన్న మెకానిజం**

'పేమెంట్ రిక్వెస్ట్' అనే ఫీచర్‌ను మోసగాళ్లు దుర్వినియోగం చేస్తూ, డబ్బు పంపుతున్నట్టు చూపించి, వినియోగదారుల నుంచి డబ్బు తీసుకుంటున్నారు. ఓఎల్ఎక్స్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో వాడుక వస్తువుల కొనుగోలు సందర్భాల్లో ఈ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వినియోగదారులు డబ్బు వస్తుందనుకుని, రిక్వెస్ట్‌ను అంగీకరించడం వల్ల వారి ఖాతాల్లోని డబ్బు మోసగాళ్లకు చేరుతోంది.

**యాప్‌లు అప్‌డేట్ చేసుకోవాలి..**

ఎన్‌పీసీఐ ఆదేశాల మేరకు, అక్టోబర్ 2 నుంచి ఈ ఫీచర్‌ను పూర్తిగా నిలిపివేయాల్సి ఉంటుంది. ఇందుకు అనుగుణంగా యూపీఐ యాప్‌లు తమ సిస్టమ్‌లను అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ఈ మార్పులు డిజిటల్ లావాదేవీల భద్రతను పెంచే దిశగా కీలక అడుగులుగా ఎన్‌పీసీఐ భావిస్తోంది.

# లైఫ్ సైన్సెస్‌లో తెలంగాణ ఘనత



**హైదరాబాద్:** ప్రపంచ లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ రాష్ట్రం ఆధిపత్యాన్ని చాటుతూ గడిచిన ఏడాదిలోనే రూ.54,000 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించింది. హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచంలో టాప్ 7 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో స్థానం సంపాదించుకుంది. ఇలా ఘనత చాటిన భారతదేశం నుంచి ఏకైక నగరంగా నిలిచింది. ఈ పెట్టుబడులు ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, సెల్ & జీన్ థెరపీ, మెడికల్ డివైసెస్, వ్యాక్సిన్లు, డిజిటల్ హెల్త్ వంటి విభాగాల్లో వచ్చాయి. ఈ పెట్టుబడులు 2 లక్షలకుపైగా ఉద్యోగ అవకాశాలు సృష్టించే వీలుంది. ఈ క్రమంలో లైఫ్ సైన్సెస్ రంగంలో పురోగతిపై తాజాగా జరిగిన తెలంగాణ లైఫ్ సైన్సెస్ బోర్డు సమావేశంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సమీక్ష నిర్వహించారు.ఇన్నోవేషన్ ఆధారిత లైఫ్ సైన్సెస్ కు తెలంగాణ ప్రపంచ కేంద్రంగా అవతరించిందని, ప్రస్తుతం 2000 లైఫ్ సైన్సెస్ కంపెనీలకు నిలయంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. టాప్ 7 గ్లోబల్ లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో ఒకటిగా హైదరాబాద్ ఆవిర్భవించడం తెలంగాణ ప్రగతిశీల విధానాలు, పటిష్టమైన మౌలిక సదుపాయాలు, టాలెంట్ రిచ్ ఎకోసిస్టమ్ ప్రత్యక్ష ఫలితం అన్నారు. ప్రతిపాదిత లైఫ్ సైన్సెస్ విశ్వవిద్యాలయాన్ని అత్యాధునిక సౌకర్యాలతో తెలంగాణ స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ గా ప్రపంచ స్థాయి స్థాయిలో అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL





# జైలు శిక్ష తప్పించుకునేందుకు..
## నాలుగేళ్లలో ముగ్గురు పిల్లలు, చివరికి

జైలు శిక్షను తప్పించుకునేందుకు ఒక మహిళ వింత నాటకానికి తెర తీసింది. దేశంలోని చట్టాలను ఉపయోగించుకొని మరీ జైలుకు వెళ్లకుండా తప్పించుకుంది. నాలుగేళ్లలో మూడు సార్లు గర్భం దాల్చిన ఘటన వార్తల్లో నిలిచింది. ఆలస్యంగా అసలు విషయం వెలుగు చూసింది. ఈ ఘటన చైనాలో చోటు చేసుకుంది. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ కథనం ప్రకారం 2020లో చెన్ హాంగ్ అనే మారుపేరుతో పిలువబడే మహిళ మోసం కేసులో దోషిగా తేలింది. ఇందుకుగాను ఆమెకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించింది కోర్టు. కానీ జైలు శిక్ష అనుభవించకుండా చైనా చట్టంలో గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు జైలుకెళ్లకుండానే, తాత్కాలికంగా తమ శిక్షను అనుభవించే వెసులుబాటును ఉపయోగించుకుంది. ఇలాంటి ఖైదీలు జైల్లో కాకుండా సాధారణంగా ఇంట్లో లేదా ఆసుపత్రులలో కమ్యూనిటీ దిద్దుబాటు సెంటర్లలో వీరు ఉండవచ్చు. 2020 2024 మధ్య, చెన్ ఒకే పురుషుడితో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. ప్రతీ సారి జైలుకెళ్లడం వాయిదా పడుతూ వచ్చింది. అయితే చైనీస్ చట్టం ప్రకారం, అటువంటి పరిస్థితులలో దోషులు ప్రతి మూడు నెలలకు వైద్య నివేదికలను సమర్పించాలి . స్థానిక కరెక్షన్ సెంటర్లలో క్రమం తప్పకుండా చెకప్‌లకు వెళ్లాల్సి ఉంటుంది. ఇక్కడే చెన్ బండారం బైటపడింది. కానీ మే 2025లో జరిగిన ఒక సాధారణ తనిఖీలో, చెన్ బేబీ కనపించకపోవడంతోపాటు, పిల్లల రిజిస్ట్రేషన్ ఆమె మాజీ భర్త సోదరి పేరుతో నమోదై ఉన్నట్టు గుర్తించారు. అంతేకాదు ఆమె తొలి సంతానం కూడా తన మాజీ భర్తతో నివసిస్తున్నట్లు తేలింది. దీంతో అసలు విషయాన్ని ఒప్పుకుంది చెన్. భర్తకు విడాకులు ఇచ్చి, ముగ్గురు పిల్లలను ఆయనకే ఇచ్చానని ఒప్పుకుంది. జైలు శిక్ష నుండి తప్పించుకోవడానికి ఆమె ఉద్దేశపూర్వకంగా గర్భధారణను ఒక వ్యూహంగా ఉపయోగించుకుందని స్థానిక ప్రొక్యూరేటరేట్ కూడా నిర్ధారించింది. అయితే ఆమెకు నిర్దేశించిన శిక్షాకాలం ఇక ఏడాది కాలమే మిగిలి ఉండటంతో చెన్‌ను మిగిలిన కాలానికి నిర్బంధ కేంద్రానికి పంపారు. ప్రస్తుతం ఈ స్టోరీ నెట్టింట వైరల్ గామారింది. కొందరు నెటిజన్లు ఆమెపై జాలి చూపించగా మరికొందరు ఔరా అంటూ నో రెళ్ల బెట్టారు. తల్లి జైలు నుండి తప్పించుకోవాలనే కోరికతోనే జన్మించిన ముగ్గురు పిల్లలపైనా మరికొందరు జాలి చూపించారు. కోరుకున్నప్పుడు గర్భవతి కావడం నిజంగా షాకే అంటూ మరికొందరు వ్యాఖ్యానించారు.

## రష్యా చమురుతో భారత సంపన్న కుటుంబాలే
# లాభపడుతున్నాయి



రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్ల అంశంపై అమెరికా మరోసారి స్పందించింది. ఈ క్రమంలో భారతీయ బిలియనీర్లపై అక్కసు వెళ్లగక్కింది. ఈ మేరకు యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ తాజాగా ఎన్‌బీసీ ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేయగా.. వైట్ హౌస్ ట్రేడ్ అడ్వైజర్ పీటర్ నవారో ఏకంగా ఓ పత్రికలో వ్యాసం రాశారు. యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ ఆ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. అంతర్జాతీయ వ్యాపార ఒప్పందాల్లో భారతదేశంలోని అత్యంత సంపన్న కుటుంబాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. రష్యాతో కొనసాగుతున్న చమురు వాణిజ్యం.. ఈ కుటుంబాలకే భారీ లాభాలను తెచ్చిపెడుతున్నాయి. ఈ క్రమంలో.. ఆంక్షలనూ లాభార్జనగా మార్చుకున్నారు అని ఆరోపించారాయన. 2022 కంటే ముందు.. ఉక్రెయిన్ సంక్షోభం కంటే ముందు రష్యా నుంచి భారత్ 1 శాతం కంటే తక్కువ చమురును కొనుగోలు చేసేది. ఇప్పుడది 42 శాతానికి చేరి ఉండొచ్చు. భారత దేశంలోని అత్యంత సంపన్న కుటుంబాలు రష్యా ఆయిల్‌ను రీసెల్లింగ్ చేసుకుంటున్నాయి. తద్వారా.. 16 బిలియన్ డాలర్ల అదనపు లాభాలను(ఒక లక్షా ముప్పై వేల కోట్ల రూపాయలు) పొందుతున్నాయి. అందుకే భారత్‌పై సుంకాలను పెంచే ప్రణాళిక రూపొందించాం. ఇవి సెకండరీ టారిఫ్‌లుగా ఉండొచ్చు అని బెసెంట్ పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. వైట్ హౌస్ ట్రేడ్ అడ్వైజర్ పీటర్ నవారో గతవారం ఓ ప్రముఖ పత్రిక కాలమ్‌లో భారత దేశంలోని చమురు వ్యాపారులపై తీవ్ర విమర్శలు చేశారు. రష్యా నుండి చమురు కొనుగోళ్లు భారతదేశపు "బిగ్ ఆయిల్" లాబీ లాభాపేక్ష వల్ల జరిగాయని.. దేశీయ అవసరాల కోసం కాదని అందులో పేర్కొన్నారు. ఆ కథనంలో.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత ఎగుమతులపై 50% టారిఫ్‌లు విధించారు. ఇందులో సగం శిక్ష రష్యా చమురు కొనుగోళ్ల కారణంగా విధించబడనుంది. భారత్ మాత్రం తక్కువ ధర ఉన్న చోట నుంచి చమురు కొనుగోలు చేయడం తమ హక్కు అని పేర్కొంటూ, ఈ అదనపు టారిఫ్‌లను అసమంజసమైనవిగా చెబుతోంది. కానీ.. చరిత్రపరంగా చూస్తే.. భారత్ రష్యా చమురును ఎక్కువగా దిగుమతి చేసుకోలేదు. ప్రధానంగా మధ్యప్రాచ్య దేశాలపై ఆధారపడేది. కానీ 2022లో ఉక్రెయిన్ యుద్ధం తర్వాత, G7 దేశాలు రష్యా చమురుపై $60పెర బ్యారెల్ ధర పరిమితి విధించడంతో.. భారత్ తక్కువ ధరకు చమురు కొనుగోలు చేసే అవకాశం పొందింది. ఇది అమెరికాకూ తెలుసు. ..ఇక చైనాపై సెకండరీ టారిఫ్‌లు విధించకపోవడానికి ఓ కారణం ఉంది. అది భారత్ కంటే ఎక్కువగా రష్యా చమురును దిగుమతి చేసుకుంటోంది. అయితే 2022 ముందు 13% ఉండగా, ఇప్పుడు 16%కి పెరిగింది. పైగా చైనా వివిధ దేశాల నుంచి చమురును దిగుమతి చేసుకోవడమే కాకుండా.. విక్రయిస్తోంది కూడా. అందుకే అమెరికా చైనాపై అదనపు టారిఫ్‌లు విధించలేదు అని అన్నారాయన.

# బ్రిటిష్ రాయల్ నేవీలో తొలి హిందూ గురువుగా భాను అత్రి



లండన్: బ్రిటిష్ రాయల్ నేవీ తొలిసారిగా హిందూ గురువును నియమించింది. హిందూ ధర్మ సిద్ధాంతాల ద్వారా నావికా సిబ్బందికి ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం చేసేందుకు ఈ నియామకం చేపట్టారు. క్రైస్తవుడు కాని వ్యక్తిని ఈ విధంగా ఎంపిక చేసిన తొలి సందర్భం ఇది. బ్రిటిష్ రాయల్ నేవీలో నియమితులైన 148 మంది కొత్త అధికారులలో భాను అత్రి ఒకరు. భాను అత్రి (39) భారత్‌లోని హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన యువకుడు. ప్రస్తుతం బ్రిటన్‌లోని ఎసెక్స్‌లో నివసిస్తున్నారు. లండన్‌లో ఒక ఆలయ నిర్వహణలో ఆయనకు దీర్ఘకాల అనుభవం ఉంది. భాను అత్రి తాజా నియామకం కోసం ఆరు వారాల అధికారిక శిక్షణ పొందారు. ఇందులో భాగంగా నాలుగు వారాల యుద్ధనౌక హెచ్ఎంఎస్ ఐరన్ డ్యూక్‌లో సముద్ర మనుగడ శిక్షణ, మూడు వారాలపాటు హిందూ గురువుగా శిక్షణ పొందారు తాను నౌకాదళంలో మొదటి హిందూ గురువుగా ఎంపిక కావడం కావడం ఆనందంగా ఉందని అత్రి అన్నారు. భాను అత్రిని హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్‌వీందర్ సింగ్ సుఖు అభినందించారు. బ్రిటన్ రాయల్ నేవీలో హిందూ గురువుగా ఎంపికైనందుకు భాను అత్రికి సీఎం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భాను అత్రి హిమాచల్‌తో పాటు దేశం గర్వించే స్థాయికి ఎదిగారన్నారు. 1986 సెప్టెంబర్‌లో జన్మించిన భాను అత్రి.. నల్వాలోని సరస్వతి నికేతన్ సీనియర్ సెకండరీ స్కూల్ నుండి ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. ఆ తర్వాత, సోలన్‌లోని సంస్కృత కళాశాల నుండి శాస్త్రి విద్యను పూర్తి చేసి, ఢిల్లీలో జ్యోతిష్య పట్టా పొందారు. 2009లో లండన్ చేరుకున్న అత్రి అక్కడ ఆలయ పూజారిగా బాధ్యతలు చేపట్టారు. భాను అత్రి తండ్రి రామ్ గోపాల్ అత్రి రిటైర్డ్ ఉపాధ్యాయుడు. భాను అత్రి తల్లి లీనా అత్రి గృహిణి.

# ఆపరేషన్ సింధూర్‌కు తోక ముడిచిన పాక్.. శాటిలైట్ చిత్రాలివే..




**న్యూఢిల్లీ:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో చొటుచేసుకున్న ఉగ్రదాడి అనంతరం భారత్ ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్‌లోని లక్షిత ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసింది.ఈ దాడులకు పాక్ వణికి పోయిందనడానికి నిదర్శనంగా కొన్ని శాటిలైట్ చిత్రాలు వెలువడ్డాయి. ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్తాన్ నావికాదళం భయంతో ఇరానియన్ సరిహద్దుకు తరలిపోవడాన్ని కొత్త ఉపగ్రహ చిత్రాలు చూపిస్తున్నాయి. పాకిస్తాన్ యుద్ధనౌకలు ప్రధాన నావికా స్థావరాల నుండి తరలించడాన్ని ఉపగ్రహ చిత్రాలు వెల్లడిస్తున్నాయి. కొన్ని నౌకలను కరాచీ వాణిజ్య రేవులకు తరలించారు. మరికొన్నింటిని ఇరాన్ సరిహద్దుకు సమీపంలో పశ్చిమ సరిహద్దుకు తరలించారు. పాకిస్తాన్‌పై భారత్ చేపట్టిన సైనిక చర్యలలో ఆపరేషన్ సింధూర్ ప్రముఖమైనదిగా నిలుస్తుంది. ఈ ఆపరేషన్ సమయంలో పాకిస్తాన్ తనను తాను రక్షించుకునేందుకు చేసిన ప్రయత్నాలపై ప్రతి రోజూ కొత్త నివేదికలు అందుతున్నాయి. తాజాగా వెలువడిన ఉపగ్రహ చిత్రాలు పాకిస్తాన్ నావికాదళం ఇరానియన్ సరిహద్దుకు తరలిపోవడాన్ని చూపిస్తున్నాయి. మే 7 మే 10 మధ్య భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. అ సమయంలో భారత్‌కు తగిన సమాధానం ఇచ్చామని పాకిస్తాన్ గతంలో వాదనకు దిగింది.అయితే ఇప్పుడు ప్రత్యక్షమైన శాటిలైట్ చిత్రాలు దీనికి భిన్నమైన తీరును చూపిస్తున్నాయి. పాకిస్తాన్ తన నావికాదళాన్ని సురక్షితంగా ఉంచేందుకు వెనక్కి తగ్గినట్లు ఈ దృశ్యాలు వెల్లడిస్తున్నాయి. మే 8న భారత్ దాడుల తరువాత రోజున పాక్ యుద్ధనౌకలు వాటి సాధారణ ప్రదేశాలలో కనిపించలేదు. మూడు యుద్ధనౌకలు కరాచీ వాణిజ్య నౌకాశ్రయంలో కనిపించాయి.

## వార్ 2 ఎఫెక్ట్.. నాగవంశీకి
# రూ. 22 కోట్లు ఆఫర్?

రెండు పెద్ద సినిమాలు ఒకేరోజు విడుదల కావడంతో బాక్సాఫీస్ దగ్గర పెద్ద యుద్ధమే జరిగింది. హిందీ బెల్ట్‌లో 'వార్ 2' హవా కనిపించగా.. దక్షిణాదిలో రజనీ 'కూలీ' జోరు కనిపించింది. హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ నటించిన "వార్ 2" తెలుగు చిత్ర పరిశ్రమలో అనుకున్నంత రేంజ్‌లో కలెక్షన్స్ రాబట్టలేకపోయింది. కానీ, హిందీ బెల్ట్‌లో దుమ్మురేపుతుంది. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా రూ. 400 కోట్లకు దగ్గరగా వార్2 కలెక్షన్స్ ఉన్నాయి. అయితే, వార్ 2 తెలుగు హక్కులను నిర్మాత నాగవంశీ సుమారు రూ. 80 కోట్ల వరకు కొనుగోలు చేసినట్లు వార్తలు వచ్చాయి. టాలీవుడ్‌లో అనుకున్నంతగా వార్2 కలెక్షన్స్ రాకపోవడంతో యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ కొంత రిటర్న్ ఇచ్చేందుకు సిద్ధం అవుతుందని వార్తలు వస్తున్నాయి. టాలీవుడ్‌లో 'సితార ఎంటర్‌టైన్‌మెంట్స్' బ్యానర్‌పై 'వార్ 2' చిత్రాన్ని నిర్మాత నాగవంశీ విడుదల చేశారు. సుమారు రూ. 80 కోట్లకు కొనుగోలు చేసిన ఆయన సులువుగా రూ. రూ. 100 కోట్లకు పైగానే రాబడుతుందని అంచనా వేశారు. కానీ, ఈ చిత్రం విడుదలైన మొదటిరోజు నుంచే కొందరు కావాలనే ట్రోలింగ్ చేయడం ప్రారంభించారు. ముఖ్యంగా ఏపీలో తెలుగు దేశం పార్టీ క్యాడర్ జూనియర్ ఎన్టీఆర్ సినిమాకు మద్దతు ఇవ్వడం





మానేసింది. వారు కూలీ సినిమా చూడాలని పెద్ద ఎత్తున సోషల్‌మీడియాలో సూచించారు. అదే సమయంలో వార్2 చిత్రంపై తీవ్రమైన ట్రోలింగ్‌కు దిగారు. దీంతో బాక్సాఫీస్ వద్ద కలెక్షన్స్‌పై ప్రభావం పడింది. బాలీవుడ్ నిర్మాణ సంస్థ యష్‌రాజ్ ఫిల్మ్స్ చాలా ప్రొఫెషనల్‌గానే డీల్ సెట్ చేసుకుంటుంది. ఈ సినిమాను కొనుగోలు చేసిన నాగవంశీకి కొంత ఉపశమనం అందించడానికి ఆ సంస్థ ముందుకు వచ్చిందని సమాచారం. నాగవంశీతో పాటు అతని భాగస్వాములకు రూ. 22 కోట్లు తిరిగి ఇవ్వడానికి యష్ రాజ్ సంస్థ అంగీకరించినట్లు బాలీవుడ్ సమాచారం. నైజాంకు రూ. 10 కోట్లు, ఏపీకి రూ.7 కోట్లు, సీడెడ్‌కు రూ. 5 కోట్ల వరకు ఇచ్చేందుకు గ్రీన్ లభించిందట. అయితే, హిందీలో ఈ చిత్రానికి ఎలాంటి నష్టం లేదని తెలుస్తోంది.



## విజయ్ దేవరకొండ కింగ్‌డమ్..
# మాస్ సాంగ్ వచ్చేసింది!

విజయ్ దేవరకొండ హీరోగా వచ్చిన యాక్షన్ థ్రిల్లర్ కింగ్‌డమ్. గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్‌లో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ మూవీలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా మెప్పించింది. జూలై 31న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం నాలుగు రోజుల్లోనే రూ.80 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. తాజాగా ఈ మూవీ నుంచి సూపర్ హిట్ సాంగ్ మేకర్స్ రిలీజ్ చేశారు. రగిలే రగిలే అంటూ సాగే మాస్ సాంగ్ ఫుల్ వీడియోను విడుదల చేశారు. ఈ పాట విజయ్ ఫ్యాన్స్‌ను తెగ ఆకట్టుకుంటోంది. ఈ పాటకు అనిరుధ్ రవిచందర్ సంగీతమందించారు. కాగా.. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు.



## ప్రభాస్ ఈ రేంజ్‌కు వెళ్తాడని ఊహించలేదు

టాలీవుడ్‌లో ప్రభాస్ తొలి సినిమా ఈశ్వర్‌లో మెప్పించిన కోలీవుడ్ ముద్దుగుమ్మ శ్రీదేవి విజయ్ కుమార్. అంతకుముందే తమిళంలో చాలా చిత్రాలు చేసిన శ్రీదేవి.. రుక్మిణి మూవీతో తెలుగులో అడుగు పెట్టింది. టాలీవుడ్‌లోనూ చాలా సినిమాల్లో తనదైన నటనతో మెప్పించింది. తెలుగులో చివరిసారిగా వీర చిత్రంలో కనిపించిన శ్రీదేవి.. చాలా ఏళ్ల తర్వాత రీ ఎంట్రీ ఇస్తోంది. నారా రోహిత్ హీరోగా వస్తోన్న సుందరకాండ మూవీలో కనిపించనుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన శ్రీదేవి విజయ్ కుమార్ ప్రభాస్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. ప్రభాస్ కెరీర్‌లోనే బెస్ట్ సినిమాల్లో ఒకటని.. తొలి సినిమాతోనే మాస్ హీరోగా మెప్పించారని అన్నారు. ఆ సినిమా సమయంలోనే ప్రభాస్ స్టార్ అవుతాడని మేము అనుకున్నామని తెలిపింది. కానీ ఈ రేంజ్‌కు వెళ్తాడని ఎవరు కూడా ఊహించలేదని శ్రీదేవి వెల్లడించింది. ప్రభాస్ చాలా మంచి వ్యక్తి అని.. ఒకరికి చెడు జరగాలని అస్సలు అనుకోరని అన్నారు. ఆయనది చిన్నపిల్లాడి మనస్తత్వమని శ్రీదేవి పేర్కొంది. కాగా. సుందరకాండ చిత్రాన్ని వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. ఈ కామెడీ ఎంటర్‌టైనర్‌లో శ్రీదేవి కీలక పాత్రలో కనిపించనుంది. ఈ చిత్రంలో వృతి వాఘాని హీరోయిన్‌గా నటించారు. సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది.



## రక్తంతో తడిసిన బెడ్‌షీట్..
### చాలా భయపడ్డా.. అమ్మ కోపంతో..

ప్రతి ఆడపిల్లకు ఓ వయసు రాగానే నెలసరి ప్రారంభమవుతుంది. స్కూల్‌లో చదువుకునే రోజుల్లోనే బాలిక కౌమార దశలోకి అడుగు పెడుతుంది. అయితే తన ఫ్రెండ్స్ కంటే తాను ఆలస్యంగా మెచ్యూర్ అయ్యానని, దానికే అమ్మ కోప్పడిందని బాలీవుడ్ ఫైర్ బ్రాండ్, ఎంపీ కంగనా రనౌత్ చెప్పుకొచ్చారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె తన ఫస్ట్ పీరియడ్ అనుభవాలను పంచుకున్నారు. కంగనా రనౌత్ మాట్లాడుతూ.. నా ఫ్రెండ్స్ అందరికీ ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి మధ్యలోనే పీరియడ్స్ మొదలయ్యాయి. నా ఫ్రెండ్స్ మెచ్యూర్ అవుతుంటే నేనింకా బొమ్మలతో ఆడుకుంటూ ఉండేదాన్ని. అప్పటికే నెలసరి రావట్లేదని కంగారుపడుతూ ఉంటే నేనేమో ఇలా బొమ్మలతో ఆడుకుంటున్నానని అమ్మ కోప్పడింది. ఆ బొమ్మల వల్లే ఇంకా పీరియడ్స్ రావడం లేదేమోనని కోపంతో వాటన్నింటినీ బయట పడేసింది. ఒకరోజు నేను నిద్రలేచేసరికి బెడ్‌షీట్ అంతా రక్తం.. ఎటు చూసినా రక్తమే కనిపించడంతో భయపడిపోయాను. కానీ, అమ్మ మాత్రం నాకు నెలసరి మొదలైందని సంతోషపడింది అని పేర్కొన్నారు. సినిమాల విషయానికి వస్తే.. 2006లో గ్యాంగ్‌స్టర్ చిత్రంతో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చారు. ఏక్ నిరంజన్ చిత్రంతో టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించారు. చివరగా ఎమర్జెన్సీ మూవీలో నటించారు. ఈ సినిమాలో దివంగత ప్రధాని ఇందిరాగాంధీగా నటించారు. అంతేకాకుండా ఎమర్జెన్సీకి స్వయంగా కంగనాయే దర్శకత్వం వహించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆకట్టుకోలేకపోయింది.

## రజనీతో మంచి పాత్రకి నో..
# విలన్ పాత్రకి సై..

విమర్శలు, ప్రశంసలకు అతీతంగా కూలీ సినిమా కలెక్షన్ల రికార్డ్స్ సృష్టిస్తోంది. సౌత్ ఇండియా సూపర్ స్టార్ రజనీకాంత్ తో కలిసి నాగార్జున తొలిసారిగా స్టైలిష్ విలన్ పాత్రలో నటించిన ఈ సినిమా విడుదలైన వారం రోజుల్లో పే బ్రేక్ ఈవెన్‌కు చేరుకుంటుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అనూహ్యమైన కాంబినేషన్లను సెట్ చేయడం ద్వారా సినిమాపై పెంచిన ఆసక్తి కలెక్షన్ల వర్షంలో ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఈ సినిమాలో సైమన్ అనే కోల్డ్ బ్లడెడ్ విలన్ విలన్ పాత్రలో నాగార్జున కనిపించడం కూడా కలెక్షన్ల జోరుకి బాగా దోహదం చేసినట్టు కనిపిస్తోంది. దక్షిణాదితో పాటు ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో ఉన్న ప్రతీ చోటా రికార్డు స్థాయిలో కలెక్షన్లు రావడం దీనికి నిదర్శనంగా చెప్పొచ్చు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో ఈ సినిమా మొదటి రోజున రూ. 17 కోట్లకు పైగా వసూలు చేసింది. ఉత్తర అమెరికాలో తెలుగు వెర్షన్ 1.3 మిలియన్ డాలర్లను సంపాదించింది, ఇది జూ.ఎన్టీయార్, హృతిక్ రోషన్‌ల వార్ 2 తెలుగు వెర్షన్ కంటే దాదాపు రెట్టింపు కావడం గమనార్హం. నాగార్జున విలన్ పాత్రను పోషించడంపై ఆ పాత్రను మలచిన తీరు ఆయన వీరాభిమానులకు అంతగా రుచించనప్పటికీ... మొదటి నుంచీ నాగార్జున వైవిధ్య భరిత పాత్రల ఎంపికను ప్రశంసించే వారికి మాత్రం సంతృప్తినే అందించింది. వీటికి అతీతంగా మరోవైపు నాగార్జున మాత్రం ఈ విజయాన్ని సంపూర్ణంగా ఆస్వాదిస్తున్నారు. ముఖ్యంగా రజనీకాంత్ తో స్క్రీన్ షేర్ చేసుకోవడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఆయన అనుభవం నుంచి తామెన్నో నేర్చుకున్నామని, సినిమా యూనిట్‌లో ప్రతీ ఒక్కరితో ఆయన ప్రవర్తించే తీరు, సినిమా పూర్తి అయిన వెంటనే అందరికీ గిఫ్ట్ బాక్స్‌లు ఇచ్చి వారిని ఆదరించిన విషయాలు నాగార్జున గుర్తు చేసుకుంటూ కొనియాడడం తెలిసిందే. రజనీకాంత్ తో కలిసి నటించాలని తాను ఎంత




కోరుకున్నారో తన మాటల ద్వారా చెప్పకనే చెబుతున్నారు నాగ్. అయితే రజనీతో చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్న విధానం చూస్తుంటే గతంలోని కొన్ని సంఘటనలు గుర్తుకు వస్తున్నాయని సినీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఈ సందర్భంగా దాదాపు 35 ఏళ్ల క్రితం నాటి సంఘటనలు గుర్తుకు తెస్తున్నారు. అప్పట్లో రజనీకాంత్ హీరోగా దళపతి అనే సినిమా తీశారు దర్శకుడు మణిరత్నం. ఆ సమయంలోనే సెన్సేషనల్ స్టార్ కాంబినేషన్‌కి ఆయన ప్లాన్ చేశారు. అందులో భాగంగా మళయాళ మెగాస్టార్ మమ్ముట్టిని కూడా ఆ సినిమాలో తీసుకున్నారు. తెలుగులో సినిమాకి ఊపు తెచ్చేలా మరో పాత్రకి నాగార్జున తీసుకోవాలని ఆయన భావించారు. ఈ విషయంపై కొన్ని రోజుల పాటు సంప్రదింపులు జరిగాయి. అయితే రజనీకాంత్‌తో, మణిరత్నంతో సినిమా చేయాలని ఎంతో ఇష్టం ఉన్నప్పటికీ నాగార్జున ఎందుకో గాని ఆ పాత్రకి అంగీకరించలేదు. దాంతో ఆ పాత్ర కోసం అప్పట్లో కొత్తగా పరిశ్రమలోకి వచ్చిన అరవింద్ స్వామిని తీసుకున్నారు. నిజానికి ఆ సినిమాలో రజనీ, మమ్ముట్టి పాత్రలకు పూర్తి భిన్నంగా అరవింద్ స్వామిది చాలా పాజిటివ్ పాత్ర. రౌడీయిజం, దాడులు,ప్రతిదాడులను అణచివేయాలనే జిల్లా కలెక్టర్ పాత్ర అరవింద్ స్వామికి మంచి పేరు తెచ్చిపెట్టింది. ఈ విషయాన్ని గుర్తు చేసుకుంటున్న సినీ వర్గాలు... అప్పట్లో రజనీ తో కలిసి మంచి పాత్ర చేయని నాగ్...ఇప్పుడు విలన్ పాత్ర చేయడం విశేషమంటూ గుర్తు చేసుకుంటున్నారు.

# జడ్జిలకు చుక్కలు చూపించిన మాస్క్ మనిషి.. నా క్యారెక్టర్ డిసైడ్ చేయొద్దు!

వచ్చే నెలలో తెలుగు బిగ్‌బాస్ తొమ్మిదో సీజన్ ప్రారంభం కానుంది. అయితే అప్పటివరకు వెయిట్ చేయాల్సిన అవసరం లేదు. మరో రెండు రోజుల్లో బిగ్‌బాస్ అగ్ని పరీక్ష మొదలుకానుంది. సామాన్యుల ఎంపిక కోసం ఈ షో డిజైన్ చేశారు. వేలాదిమంది అప్లై చేసుకుంటే బిగ్‌బాస్ టీమ్ వారిని జల్లెడపట్టి 45 మందిని సెలక్ట్ చేశారు. వారి మాట, ఆట తీరు బట్టి తొమ్మిదో సీజన్‌కు ఎవర్ని సెలక్ట్ చేయాలి? ఎవర్ని రిజెక్ట్ చేయాలన్నది బిందు మాధవి, నవదీప్, అభిజిత్ చేతిలో పెట్టారు.

**నీకొక్కడికే హృదయం ఉందా?**

ఈ క్రమంలో తాజాగా ఓ ప్రోమో రిలీజ్ చేశారు. అందులో ఓ మాస్క్ మ్యాన్ స్టేజీపై ఎంట్రీ ఇచ్చాడు. నీ పేరేంటని జడ్జిలు అడగ్గా.. స్కిన్ నేమ్ మానవ్.. సోల్ నేమ్ హృదయ్ మానవ్ అన్నాడు. హృదయ్ మానవ్ పేరుకు అర్థమేంటన్న ప్రశ్నకు.. హృదయమున్న మానవుడు అని సింపుల్‌గా రిప్లై ఇచ్చాడు మాస్క్ మ్యాన్. అంటే మా అందరికీ హృదయాలు లేవా? అని నవదీప్ అడగ్గా పోనీ, అలాగే అనుకోండి అని ర్యాష్ ఆన్సరిచ్చాడు.

**కోపమొస్తే కొట్టేస్తా..**

చిన్నప్పటి నుంచి కోపిష్టిని, కోపమొస్తే ఆగను.. కొట్టేస్తా! అనడంతో జడ్జిలు షాక్‌తో నోరెళ్లబెట్టారు. బిగ్‌బాస్ హౌస్‌లోకి వెళ్లేది ఫ్రెండ్‌షిప్ చేసుకోవడానికి కాదన్న మాటకు అభిజిత్ ఏకీభవించలేదు. ఫ్రెండ్స్ ఎందుకు చేసుకోకూడదు? అని అడిగితు.. ఫ్రెండ్స్‌కు ట్రోఫీ ఇచ్చేస్తామా? అని మాస్క్ మనిషి సెటైర్ వేశాడు. ఇతడి తీరు నచ్చక అభిజిత్ రెడ్ సిగ్నల్ చూపించాడు. దీంతో అతడు నాకు ఛాన్సివ్వాలని లేకపోతే ఓకే.. కానీ నా క్యారెక్టర్‌ను డిసైడ్ చేయొద్దు అని వార్నింగ్ ఇచ్చాడు.

**జడ్జి చేయడానికి దేవుళ్లా?**

జడ్జి చేయడానికే ఇక్కడ కూర్చున్నామని నవదీప్ కౌంటరిచ్చాడు. అప్పటికీ అతడు మీరేమైనా దేవుళ్లా అంటూ.. మాట్లాడుతూనే పోయాడు. ఇక బిందు మాధవి.. అతడి మెడలో లూజర్(ఓటమిపాలు) బోర్డు తగిలించింది. ఈ ప్రోమో చూసిన జనాలు.. మాస్క్ మనిషి ఇలా ఉన్నాడేంట్రా బాబూ.. అని కామెంట్లు చేస్తున్నారు. ఈ అగ్నిపరీక్ష షో హాట్‌స్టార్‌లో ఆగస్టు 22 నుంచి ప్రసారం కానుంది.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

# భారీగా నిషేధిత పొగాకు ఉత్పత్తులు పట్టివేత

### లక్ష 21 వేల విలువైన నిషేదిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం




**వరంగల్ మహా ;** వరంగల్ రైల్వే స్టేషన్ వద్ద బుధవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తి నుంచి రూ. 1,21,920 విలువైన ప్రభుత్వ నిషేధిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఇంతె జార్గంజ్ పోలీసులు తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా, రామన్న పేట నివాసి అయిన గొల్ల రమేష్ (51) పట్టుబడినట్లు పేర్కొన్నారు. తండ్రి రాజయ్య పేరు కాగా, ఇతను పెరిక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అని వెల్లడించారు. పొగాకు ఉత్పత్తులను స్వాధీనపరుచుకుని, రమేష్ పై కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ దాడుల్లో ఇన్స్పెక్టర్ ఎం.ఎ. షుకూర్, సబ్ఇన్స్పెక్టర్లు ఎన్. వెంకటేశ్వర్లు, జి. రోహిత్, కానిస్టేబుళ్లు ఎం. రాజయ్య, కె. రజినీకాంత్ పాల్గొన్నారు.

# మహిళా కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్



**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలోని దామెర కుట్టు శిక్షణ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని హన్మకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా కుట్టు శిక్షణ కేంద్రం ట్రైనర్స్, కుట్టు శిక్షణలో మెలకువలు నేర్చుకుంటున్న మహిళలతో కలెక్టర్ మాట్లాడారు. కుట్టు శిక్షణ కేంద్రం గురించిన వివరాలను నిర్వాహకులు, అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కుట్టు శిక్షణ కేంద్రం ద్వారా ఇప్పటివరకు ఎంతమంది మహిళలు శిక్షణ పొందారని, కుట్టు శిక్షణలో నైపుణ్యాభివృద్ధిని ఎలా పెంపొందిస్తున్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. శిక్షణానంతరం ఉపాధి అవకాశాలను గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కుట్టు శిక్షణలో నైపుణ్య అభివృద్ధిని సాధించాలని మహిళలకు సూచించారు. శిక్షణానంతరం ఉపాధి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. మహిళా కుట్టు శిక్షణ నైపుణ్య అభివృద్ధి కేంద్రం ఆవరణలో కలెక్టర్ మొక్క నాటి నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ మేన శ్రీను, సెర్ప్ అడిషనల్ డిఆర్డివో వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కల్పన, డిపిఎం రాజేంద్రప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కాలేశ్వరంలో గోదావరి నది ఉగ్రరూపం

## డేంజర్ లేవలకు దగ్గరగా వరద ప్రవాహం

### కాలేశ్వరం పుష్కర ఘాట్ లో దుకాణాలు ఖాళీ చేయాలని హెచ్చరిక

### వరద ప్రవాహాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే



**కాటారం, మహా :** అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి నదికి వరద ప్రవాహం బుధవారం బాగా పెరుగుతోంది. కాలేశ్వరం లో గోదావరి బాణాహిత నదుల త్రివేణి సంగమ తీరం పుష్కర ఘాట్లో గోదావరి నదికి వరద ప్రవాహం పోటెక్కింది. కడెం ప్రాజెక్టు, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండి భారీగా నీటిని దిగువకు విడుదల చేశారు. ఉదయం నుండి గంట గంటకు గోదావరి నదికి కాలేశ్వరంలో వరద బాగా పెరిగింది. బుధవారం రాత్రి 9 గంటలకు కాలేశ్వరంలో 12.820 మీటర్ల ఎత్తులో వరద ప్రవాహం కొనసాగుతున్నట్టు సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. ఉదయమే మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. 13.460 మీటర్ల ప్రవాహం దాటితే డేంజర్ లెవెల్ కి చేరుకుంటుంది. శుక్రవారం మధ్యాహ్నం గోదావరి నది వరద ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, డిఎఫ్ఓ నవీన్ రెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఇలాంటి పరిస్థితుల్లో నైనా ఎదుర్కొనే ప్రజలను నష్టం వాటిల్లకుండా రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను అప్రమత్తం చేశారు. ముందు జాగ్రత్తగా గోదావరి తీరంలో వ్యాపారం నిర్వహిస్తున్న దుకాణం దారులను ఖాళీ చేయాలని అధికారులు హెచ్చరించారు. మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీలో పది లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది.

# శ్రీ ఈదమ్మ పోచమ్మ దేవాలయంలో ఘనంగా శంకు పూజ



**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ గ్రామంలో అతి పురాతనమైన శ్ర ఈదమ్మ,పోచమ్మ, అమ్మవార్ల దేవాలయంలో బుధవారం శంకు పూజ కార్యక్రమాలు , వేద పండితులు రేవల్ల రాజుశర్మ నిర్వహించారు. కార్యక్రమానికి వెసెల్ల గ్రూప్ ఆఫ్ కంపెనీ అధినేత శివానంద్ రెడ్డి దయానంద్, మైలార్దేవపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, జయప్రకాష్,మాజీ కౌన్సిలర్ దయానంద్,అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షులు జీ.బాబురావు రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొక్క ప్రభాకర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నేతలు లలిత్ వర్రీ, శ్రవణ్,పెండ్యాల శ్రీధర్,రజినీకాంత్ గౌడ్,దేవాలయ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

# అధ్యాపకుడు డా.శంకర్ కు జాతీయ సమైక్యత పురస్కారం

### గర్వకారణంగా ఉంది కళాశాల ప్రిన్సిపాల్ రాధిక




**రంగారెడ్డి జిల్లా మహా:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డా. శంకర్ కు జాతీయ సమైక్యత పురస్కారం రావడం గర్వకారణమని ప్రిన్సిపాల్ రాధిక అన్నారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తులో అంతర్జాతీయ యువజన ఉత్సవాల ముగింపు కార్యక్రమం సందర్భంగా, ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఈ శంకర్ కి సామాజిక సేవా విభాగంలో జాతీయ సమైక్యత పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. రాధిక మాట్లాడుతూ... విద్యా మరియు సామాజిక రంగంలో విశేషమైన కృషి చేస్తున్న కామర్స్ అధ్యాపకుడు డాక్టర్ శంకర్ కు ఈ పురస్కారం లభించడం కళాశాలకు గర్వకారణమని, భవిష్యత్తులో ఇంకా ఎన్నో అత్యున్నత పురస్కారాలు అందుకోవాలని శుభాకాంక్షలు తెలియజేశారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్, వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి సురేష్, అధ్యాపకులు డివి రావు, శ్రీకృష్ణ, హృదయరాజు, వీరారెడ్డి, కృష్ణ, నరేందర్ రెడ్డి, మరియు విద్యార్థిని విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

# చవితికి సిద్ధమవుతున్న గణనాథులు

### కొనుగోలు చేసేందుకు వస్తున్న యువజన సంఘాలు.. ఆకర్షణీయంగా విగ్రహాలు.. 27న వినాయక చవితి







**ఆమనగల్లు, మహా:** దేశంలో వైభవంగా జరుపుకునే పండుగలలో వినాయక చవితి ఒకటి. వినాయకుడి పండగ వస్తుందంటే చాలు చిన్న, పెద్ద, పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అందరూ ఉత్సాహంగా మండపాలు ఏర్పాటు చేసుకుని విగ్రహాలను ప్రతిష్టిస్తుంటారు.ఈ పండుగకు చిన్నారులు, యువత, యువజన సంఘాలు, కాలనీ అభివృద్ధి కమిటీలు తమ కాలనీల్లో గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించటం ఆనవాయితీగా మారింది. ఈ నెల 27 వినాయక చవితి పండుగ ప్రారంభం కానుంది.

**జోరుగా విగ్రహాల తయారీ**

ఆమనగల్లు మున్సిపల్ పరిధిలో 12మంది కళాకారులు వినాయక విగ్రహాల తయారీలో బిజీగా ఉన్నారు. రాజస్తాన్ నుంచి వచ్చిన కళాకారులు రూ.500 నుంచి రూ.50,000 వరకు ధరలు గల విభిన్న పరిమాణాల్లో విగ్రహాలను తయారు చేస్తున్నారు. మట్టి గణపతి విగ్రహాలు ధరలు రూ.1,000 నుంచి రూ.15వేల వరకు ఉన్నాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరికీ ఆకట్టుకునే విధంగా విగ్రహాల రూపకల్పన చేశారు. మరికొందరు హైద్రాబాద్ నుంచి కొనుగోలు చేసి విక్రయిస్తున్నారు.

**పర్యావరణానికి ప్రాధాన్యత..**

పర్యావరణ పరిరక్షణ కోణంలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు మట్టి గణపతిని ప్రోత్సహిస్తున్నాయి. ఈ ప్రభావంతో చాలామంది పీవోపీ విగ్రహాల కంటే మట్టివిగ్రహాలకే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు.

**సైజును బట్టి పెరిగిన ధరలు**

విగ్రహాల సైజు, రూపం బట్టి ధరలు నిర్ణయించి అమ్ముతున్నారు.ఈ సంవత్సరం ముడి సరుకుల ధరలు పెరగడంతో విగ్రహాల ధరలు కూడా స్వల్పంగా పెరిగినట్టు కళాకారులు తెలిపారు.చాలా మంది భక్తులు ఇప్పటికే అడ్వాన్స్ చెల్లించి తమ విగ్రహాలను బుక్ చేసుకుంటున్నారు.

**నిబంధనలు పాటించేలా చర్యలు**

వినాయక ఉత్సవ కమిటీల వారు నిబంధనలు పాటించేలా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, రాజకీయ నాయకులతో సమావేశాలు ఏర్పాటుచేశారు. ఉత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. పోలీస్‌శాఖ రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు రాత్రి సమయంలో ఉండాలని, శాంతియుతంగా ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు. ఎవరైన శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

**శాంతియుతంగా జరుపుకోవాలి**

వినాయక చవితి నవరాత్రులను శాంతియుత వాతావరణంలో జరుపుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేసి నిబంధనలు వివరించాం. మండపాల వద్ద ప్రమాదాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలి. వినాయక మండపాల వద్ద నిఘా ఉంటుంది. నిరంతరం పెట్రోలింగ్ కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.

**మట్టి వినాయకుడినే పూజిద్దాం**

రసాయనాలతో తయారు చేసే ప్రతిమలను కాకుండా మట్టి వినాయకుడిని పూజించాలి.. అనాధిగా మట్టి విగ్రహాలనే పూజిస్తున్నాం. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే వాడుకోవడం మంచింది.సహజసిద్ధంగా దొరికే బంకమట్టితో విగ్రహాలు తయారు చేసుకోవడం మంచిది. ఇది నీటిలో సులభంగా కరిగిపోతుంది. మట్టి విగ్రహాల నిమజ్జ నంతో జలవనరులకు ఎలాంటి నష్టం ఉండదు.స్వచ్ఛమైన మట్టితో తయారు చేసిన వినాయకుడి ప్రతిమనే పూజకు ఉపయోగించాలని స్పష్టం చేస్తున్నారు పర్యావరణ పరిరక్షణ ప్రేమికులు.

# కళాశాల భవనం పూర్తి చేయండి

### స్వరాష్ట్రంలో కూడా చెట్ల కింద ఆరుబయట చదువులు

### ఏళ్లు గడిచినా సొంత భవనం లేకపోవడం విచారకరం- ఎస్ఎఫ్ఐ




**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం పూర్తి చేసి విద్యార్థుల ఇబ్బందులు తీర్చాలని ఎస్ ఎఫ్ ఐ రంగారెడ్డి కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీశైలం హైదరాబాద్ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి 24 ఏళ్లు గడిచినా సొంత భవనం లేకపోవడం విచారకరమన్నారు. గతంలో సొంత భవన నిర్మాణం ప్రారంభించినా వివిధ కారణాలతో అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు.ఈ ప్రాంతానికి ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు మారుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల పనులు పూర్తి కావటం లేదని, స్వరాష్ట్రంలో కూడా చెట్ల కింద ఆరుబయట చదువులు కొనసాగే దుస్థితి ఉన్నది. కనీసం విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. గత ప్రభుత్వం జూనియర్ కళాశాల నిర్మాణానికి కృషి చేయకుండా కాలయాపన చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18నెలలు గడుస్తున్న పట్టించు కోవటం లేదని ,ఇప్పటికైనా కాలేజీ భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.డిగ్రీ కళాశాలకు కూడా సొంత భవనం నిర్మించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షులు శివ శంకర్,ఎస్ ఎఫ్ఐ అమనగల్లు కార్యదర్శి కుర్మిద్ద శివ, శివ వంశీ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీని విడి బిఆర్ఎస్ పార్టీలో చేరిన మైనార్టీ నాయకులు

### పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



**రాజేంద్రనగర్ మహా ;** మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి, సీనియర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో మణికొండ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు మహమ్మద్ దస్తగిరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ మోసిన్, మహమ్మద్ రియాన్, మహమ్మద్ షాయాస్ లు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. సబితా ఇంద్రారెడ్డి పార్టీ కండువా కప్పి బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. భవిష్యత్తులో అధికారంలోకి రాబోయే పార్టీ బిఆర్ఎస్ పార్టీ అన్నారు. కాంగ్రెస్ గ్యారంటీలపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. ప్రభుత్వం చెప్పేదొకటి చేసేది ఒకటి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గ్యారెంటీ ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. భవిష్యత్తులో బిఆర్ఎస్ పార్టీలో మరేనో చేరికలు ఉంటాయన్నారు.

# గణేష్ మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి



**ఆమనగల్లు, మహా:** గణేష్ మండపాల ఏర్పాటు, ఊరేగింపులకు ఆన్ లైన్ లో అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలని కడ్తాల సిఐ గంగాధర్ కోరారు. బుధవారం కడ్తాల్ పోలీస్ స్టేషన్ లో పీస్ మీటింగ్ నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర పోలీస్ వెబ్ సైట్ లింక్https://policeportal.tspolice.gov.in/ దరఖాస్తు చేసుకోవాలని, ఆన్ లైన్ ఇన్ఫర్మేషన్ అనేది కేవలం మండపానికి సంబంధించిన సమాచారం, నిర్వాహణ కోసం మాత్రమేనని తెలిపారు. ఈ సమాచారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయడానికి పోలీసులకు సులభంగా ఉంటుందని తెలిపారు. గణేష్ మండపాల నిర్వాహకులు కొన్ని నియమ నిబంధనలు పాటించాల్సి ఉంటుందని, ముఖ్యంగా మండపాల ఏర్పాటు చేసే స్థలం కోసం సంబంధిత శాఖల వారి అనుమతులు తీసుకోవాలని, ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సిఐ సూచించారు. నిర్దేశించిన సమయానికి నిమజ్జనం పూర్తి చేయాలని, మండపాలను ప్రజా రవాణా, అత్యవసర వాహనాలకు, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు.

# దేశంలో టెక్నాలజీని అభివృద్ధి చేసిన మహా నాయకుడు

### కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు పల్లాటి రవీందర్



**రంగారెడ్డి జిల్లా మహా:** నోములలో భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. మంచాల మండలం, నోముల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పల్లాటి రవీందర్ ఆధ్వర్యంలో దివంగత భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రవీందర్ మాట్లాడుతూ... దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన గొప్ప మహనీయుడని ఆయన కొనియాడారు. దేశ ప్రధానిగా ఆయన ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి దేశాన్ని ప్రపంచంలోనే ప్రథమంగా నెలకొల్పిన దార్శనికుడని అన్నారు. ప్రపంచంతో పోటీపడుతూ ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని రవీందర్ పేర్కొన్నారు. దేశ ప్రజల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం అహర్నిశలు తపించిన గొప్ప నాయకుడని అన్నారు. అనంతరం గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి కందకట్ల ఇంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లారెడ్డి జయానందం, మాజీ సర్పంచ్ వల్లూరు ముత్యమయ్య, దూసరి శ్రీనివాస్, కందకట్ల జైపాల్ రెడ్డి, పల్నాటి భాస్కర్, గ్రామ యూత్ సభ్యులు, ఇందిరమ్మ క మిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హైదర్‌గూడా అపార్ట్‌మెంట్‌లో ఓ ఫ్లాట్ లో అగ్ని ప్రమాదం

**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్ గూడ లోని ఓ అపార్ట్మెంట్ ఫ్లాట్ లో ప్రేరణ క్రియేషన్ ఆర్ట్ అకాడమీ స్టూడియోలో బుధవారం అగ్ని ప్రమాదం జరిగింది. చుట్టుముట్టు భారీ అపార్ట్మెంట్ల మధ్యలో అగ్ని ప్రమాదం సంభవించడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఫ్లాట్లు పలు సామాన్లు అగ్నికి ఆవుతాయి. సరైన సమయంలో అగ్నిమాపక సిబ్బంది చేరుకోవడంతో మంటలను వ్యాప్తి చెందకుండా అదుపు చేశారు. పూజ గదిలో దీపం పెట్టడంతో పక్కనే ఉన్న పేపర్ కి నిప్పు అంటుకొని మంటలు చెలరేగాయి. భారీగా మంటలు ఎగిసిపడేసరికి స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందజేశారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

# మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పని చేస్తాం

### కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**రాజేంద్రనగర్ మహా ;** మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని వినాయక్ నగర్ లో గాయత్రి మాత టెంపుల్ పరిసర ప్రాంతాల్లో ప్రజలు సి సి రోడ్డు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతన సీసీ రోడ్డుల కొరకై రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, జిహెచ్ఎంసి, హెచ్ఎండబ్ల్యూఎస్, ఎస్పి అధికారులతో కలిసి కాలనీ లో బుధవారం పర్యటించారు. నూతన సీసీ రోడ్లు పనులకు ప్రతిపాదనలు త్వరగా సిద్ధం చేయాలని అధికారులను కోరారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కృషి చేస్తానన్నారు. డివిజన్ పరిధిలో సమస్యలు ఉంటే తన దృష్టి తీసుకురావాలి. అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

# గణేష్ మండపాల బాధ్యత ఉత్సవ కమిటీ సభ్యులదే

### ఆదిభట్ల పోలీసు స్టేషన్ సీఐ బి రవికుమార్

**రంగారెడ్డి జిల్లా మహా:** గణేష్ మండపాల నిర్వాహకులు పాటించవలసిన నియమనిబంధనలు సీఐ రవికుమార్, ఉత్సవ కమిటీల సభ్యులకు వివరించారు. ఆదిభట్ల పోలీసు స్టేషన్ పరిధిలోని బొంగులూరు గ్రామంలో గణేష్‌మంటపాల నిర్వాహకులు, యువజన సంఘాల సభ్యులతో సమావేశం సీఐ బి రవికుమార్ ఏర్పాటు చేశారు. సిఐ మాట్లాడుతూ... ప్రజలు శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రులు జరుపుకోవాలని సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులు పాటించవలసిన నియమ నిబంధనలు, జాగ్రత్తల గురించి వివరించారు. గణేష్‌మండపాల నిర్వాహకులు పాటించవలసిన నియమనిబంధనలు, గణేష్ మండపాల పూర్తి బాధ్యత ఉత్సవ కమిటీ నిర్వాహకులదేనని, ప్రతీ మండపం వద్ద తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు. గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట అడటం, అసభ్యకరమైన నృత్యాల ఏర్పాటు, అన్యమతస్తులను కించపరిచే విధంగా ప్రసంగాలు చేయడం, పాటలు పాడటంపై పూర్తిగా నిషేధించాలని లేనిచో వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. మండపాల వద్ద ఏదైనా అనుమానాస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు వ్యక్తులు కనిపించినట్లయితే తక్షణమే డయల్ 100 గాని లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. నిర్దేశించిన సమయనికి నిమజ్జనం పూర్తి చేయాలని ప్రత్యేకంగా తెలిపారు.

# గండిపేట రెండు గేట్లు ఎత్తి దిగువ ప్రాంతానికి నీటి విడుదల



**రాజేంద్రనగర్ మహా ;** ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షానికి గండిపేట నిండు కుండల మారింది. జలమండలి జీఎం సంతోష్ కుమార్, డీజీఎం నరహరి, ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి తో కలిసి గండిపేట్ జలాశయంలోని రెండు గేట్లను ఒక్క ఫీట్ కు ఎత్తి దిగువ ప్రాంతానికి నీటిని విడుదల చేశారు. గేట్లు ఎత్తేముందు దిగువ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసేందుకు హారన్లు మోగించారు. అనంతరం గండిపేట్ జలాశయం గేట్లను ఎత్తి దిగువ ప్రాంతానికి నీటిని విడుదల చేశారు. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 1790 పీట్లు,3.9 టిఎంసీలు. ప్రస్తుత నీటి మట్టం ,1788.60 పీట్లు, 3,579 టిఎంసీలు ఎగువ కురుస్తున్న వర్షానికి జలాశయానికి ఉన్ ఫ్లో 1200 క్యూసెక్కులు.